



క్లాసు వదిలి బయటికి వస్తూన్న స్వాతిని అడిగింది ఉమ.

స్వాతి నవ్వుతూ -- "దేనికమ్మా" అంది.

"ఇవ్వాళ నా బర్త్‌డే మేడమ్!"

"అలాగా! విష్ యూ హేపీ బర్త్‌డే!" అంటూ శుభాకాంక్షలు చెప్పింది స్వాతి.

"ఇప్పుడు కాదు మేడమ్! సాయంత్రం మా ఇంటికొచ్చి చెప్పండి."

"అలాగేలే"

"'అలాగే' అంటే కాదు మేడమ్! తప్పక రావాలి. వస్తారు కదూ!"

"అలాగేనమ్మా! తప్పక వస్తాను" అని స్టాఫ్ రూములోకి వచ్చింది స్వాతి.

"ఎక్కడికి వస్తానంటున్నావ్ స్వాతి!"

స్వాతి కుర్చీలో కూర్చుని, ప్రక్క కుర్చీలో వున్న కళ్యాణిని చూస్తూ --

"ఉమ అని నా స్టూడెంటు బర్త్‌డేట. సాయంత్రం పార్టీకి పిలిచింది. అవునుగానీ నిన్న మా ఇంటికి వస్తానని రాలేదే" అంది స్వాతి.

"నిన్న కృష్ణతో సినిమాకి వెళ్లాను" అంది కళ్యాణి!

ఆ మాటకు స్వాతి నవ్వుతూ -

"ఉహూ! అయితే మీ ప్రేమ ముదిరి పాకాన పడిందన్న మాట."

"ఇదిగో, ఈ చీర కృష్ణ కొన్నాడు. బాగుందా?"

స్వాతి కళ్యాణి కట్టుకున్న చీరని చూసింది. తెలుపుమీద నీలం పువ్వులున్న నైలెక్స్ చీర. బాగానే వుంది!

"ఈ నెల్లో ఒక వుంగరం చేయించమని అడిగాను. చేయిస్తానన్నాడు"

"కళ్యాణీ! నేనో మాట అడగనా?"

కళ్యాణి స్వాతి వేపు ఆశ్చర్యంగా చూస్తూ - "అడుగు" అంది.

"నువ్వు కృష్ణనా, అతని డబ్బునా ప్రేమిస్తోంది" అంది సీరియస్‌గా.

"ఓస్ ఇదేనా!" అంటూ నవ్వేసి -- "ప్రేమ వర్ధిల్లాలంటే డబ్బు కావాలే!" అంది కళ్యాణి.

ఈ కొత్త సిద్ధాంతం విని తెల్లబోయింది స్వాతి. కళ్యాణికి నగలూ, చీరలంటే ఇష్టం. కాని కళ్యాణిది సామాన్య కుటుంబం. ఆమెమీద ఆధారపడిన జీవాలు చాలా వున్నాయి. తన కోరికలు తీర్చుకోవడం కోసం కళ్యాణి ఈ పద్ధతి అనుసరిస్తోందేమో? అయితే దానికి ప్రేమనే ముసుగు దేనికి? సరే పోనీ! దాని గొడవ అది పడుతోంది! అనుకుంది --

* * *

సాయంత్రం కాలేజీ వదిలాక ఇంటికెళ్లి తయారయి ఆ ప్రాంతంలో ఉమ ఇంటికి బయలుదేరింది స్వాతి!

ఉమ చెప్పిన గుర్తులు ప్రకారం అయితే అదే నాల్గిల్లు అయివుండాలి!

రిక్షాని ఇంటిముందు ఆపింది.

కానీ ఇల్లు నిశ్శబ్దంగా వుంది. ఏ సందడీ కన్పించలేదు!

అనుమానిస్తూనే స్వీటు తీసుకుని లోపలకు వెళ్లింది. స్వాతిని చూసి ఉమ ఎదురొచ్చి --

"రండి మేడమ్!" అంటూ ఆహ్వానించింది.

ముందు గదిలో నాల్గు కుర్చీలు మధ్యలో ఒక టేబిలు వుంది.

"కూర్చోండి మేడమ్!" అంది ఉమ కుర్చీ చూపుతూ.

"ఉమా! ఇంకా ఎవరూ రాలేదా!" అంది స్వాతి చుట్టూ చూస్తూ.

"ఇంకెవర్నీ పిలవలేదు మేడమ్! మిమ్మల్నొక్కర్నే పిలిచాను!"

స్వాతి ఆశ్చర్యపడింది! "నన్నొక్కదాన్నేనా?"

"అవును మేడమ్! నాకు మీరంటే ఇష్టం! మీరొక్కరొచ్చి నన్ను ఆశీర్వదిస్తే చాలు!" అని లోపలికెళ్లింది.

ఆ పిల్లకి తనమీద వున్న అభిమానానికి మనసులో ఆనందం కలిగింది స్వాతికి.

"అన్నయ్యా! ఈవిడే మా స్వాతీ మేడమ్!"

ఆ మాటలకి తలెత్తి చూసింది స్వాతి! ఎదురుగా ముప్ఫై ఏళ్ల యువకుడు నిలబడి వున్నాడు. పొడవుకు తగ్గ లావుతో ఠీవిగా, అందంగా వున్నాడు.

"మేడమ్! ఈయన మా అన్నయ్య. పేరు రవి. ఈ వూళ్లోనే ఒక ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు!" అంటూ పరిచయం చేసింది ఉమ.

స్వాతి నిలబడి నమస్కారం చేసింది. అతడూ తిరిగి నమస్కారం చేశాడు.

"కూర్చోండి మేడమ్!" అంది ఉమ. స్వాతి కూర్చుంది.

రవి కూడా స్వాతి కెదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు. ఉమ లోపలకు వెళ్లింది.

స్వాతి అతనివేపు చూసింది. రవి స్వాతి వేపే చూస్తున్నాడు. స్వాతి తనవేపు చూడగానే చిన్నగా నవ్వాడు. ఆ నవ్వు చూసి స్వాతి తలదించుకుంది.

ఎందుకలా గుచ్చి గుచ్చి చూస్తున్నాడు! పైగా ఎంతో పరిచయమున్న వాడిలా ఆ నవ్వేమిటి? స్వాతి ఇబ్బందిగా ఫీలయింది.

ఇంతలో ఉమ రెండు ప్లేట్లలో టిఫిను తెచ్చి ఇద్దరి ముందూ పెట్టింది.

"అదేమిటన్నయ్యా! మా మేడమ్‌తో మాట్లాడకుండా అలా కూర్చున్నావే?"

"కంపెనీలో పన్జేసేవాడిని, నాకేం చేతనవును మాట్లాడ్డం? మీ మేడమ్‌గారే మాట్లాడాలి!" అన్నాడు నవ్వుతూ.

"మా మేడమ్ క్లాసులోనే మాట్లాడుతారన్నయ్యా! బయట మాట్లాడరు" అంది ఉమ.

"మీ మేడమ్‌ని బాగానే వెనకేసుకొస్తున్నావు కానీ, ముందు వెళ్లి 'మంచినీళ్ల పట్రా." అన్నాడు రవి.

ఉమ లోపలకు వెళ్లాక, "తీసుకోండి!" అంటూ ఒక ప్లేటు స్వాతి ముందుంచాడు.

స్వాతి మెల్లగా తింటోంది.

"మిమ్మల్ని చాలాసార్లు చూశాను. కానీ మీ పరిచయం మాత్రం ఇప్పుడే కలిగింది" అన్నాడు రవి.

"అలాగా! ఎక్కడ చూశారు?"

"ఎక్కడేమిటండీ! మీరు కాలేజీకి వెళ్లేటప్పుడూ, వచ్చేటప్పుడూనూ!"

"మీ కంపెనీ ఎక్కడ?"

చెప్పాడు రవి. అతని కంపెనీ ఒక మూల. తన కాలేజీ ఒకమూల. మరి ఎలా చూసేవాడో! అయినా ఈ మగాళ్ల కింతకన్నా పనేముంది? అనుకుంది స్వాతి.

"ఇవ్వాళ నాకు చాలా ఆనందంగా వుంది!" అన్నాడు రవి.

స్వాతి మాట్లాడలేదు.

"ఎందుకని అడగరే?"

"చెప్పండి!"

"మీతో పరిచయం కలిగినందుకు!" అతని చొరవకి ఆశ్చర్యం వేస్తోంది స్వాతికి. కానీ ఎందుకో అతడలా మాట్లాడుతూంటే ఇంకా వినాలన్పిస్తోంది

ఉమ మంచినీళ్లు, కాఫీ తెచ్చింది.

ఇద్దరూ తీసుకున్నారు.

ఉమ కూడా ఒక కుర్చీలో కూర్చుంది.

"అన్నయ్యా! మా మేడమ్ ఎంత బాగా పాఠాలు చెప్తారో తెలుసా! మళ్లీ పుస్తకం చదవక్కర్లేదు."

"ఆఁ! తెలుస్తూనే వుందిలే!" అన్నాడు రవి స్వాతివేపు చూస్తూ.

స్వాతి కాఫీ కప్పు టేబుల్‌మీద పెట్టింది. ఉమ లేచి ఇద్దరి కాళ్లకూ నమస్కారం చేసింది. రవి వంద రూపాయలిచ్చాడు. స్వాతి పుస్తకాలిచ్చింది.

"మొత్తానికి మేడమ్ అనిపించుకున్నారు!" అన్నాడు రవి నవ్వుతూ

"నేను మేడమ్‌నని కాదు! ఉమ స్టూడెంట్ అని ఇచ్చాను" అంది స్వాతి.

"ఓహో! నిజం చెప్పారు!"

"ఉమా! మీ అమ్మగారు లోపల వున్నారా?" అనడిగింది స్వాతి.

ఆ మాటలకు ఉమ ముఖం నల్లబడింది. రవి ఉమని దగ్గరికి తీసుకుని --

"ఉమకి అమ్మ లేదండి! నాన్నగారున్నారు. ఆయన ఏదో పనిమీద బయటికెళ్లారు. ఇంట్లో

ఆయా వుంది. ఆవిడే ఉమకి కావల్సినవన్నీ అమరుస్తుంది'' అన్నాడు.

స్వాతి నొచ్చుకుంది.

''ఉమా ! తెలీక అడిగాను. ఏమనుకోకమ్మా ! పుట్టినరోజు పూట నీ మనసు బాధ పెట్టినట్టున్నాను'' అంది.

''లేదు మేడమ్ ! అన్నిటికీ మించి ఇంత మంచి అన్నయ్య వున్నాడు నాకు. అది చాలండీ.''

రవి ఉమ తలని ప్రేమగా నిమురుతూ – ''నిజంగా ఉమకి నేను స్వంత అన్నయ్యనైతే ఎంతో బాగుండుననిపిస్తుందండీ అప్పుడప్పుడు !'' అన్నాడు.

''ఉమకి మీరేమవుతారు ?''

''ఏదో కొద్దిగా దూరపు చుట్టరికం వుంది. దానికన్నా మా మధ్య వున్న స్నేహమే ఎక్కువ'' అంటూ ఉమ కుటుంబానికీ, తనకూ వున్న అనుబంధాన్ని గూర్చి చెప్పాడు.

కొద్ది నిముషాలు గడిచాయి.

స్వాతి వాచీ చూసుకుంటూ – 'వస్తానండీ ! చీకటి పడింది.' అంటూ లేచింది.

రవి, ఉమ కూడా లేచారు.

''మీ నాన్నగారిని పరిచయం చేసుకోలేక పోయాను ఉమా !'' అంది స్వాతి.

''దానికోసమైనా మీరు మళ్లీ మా ఇంటికి రావాలి మేడమ్ !'' అంది ఉమ.

''అలాగేనమ్మా ! నువ్విచ్చిన పార్టీకి థాంక్స్ ! వస్తాను రవిగారూ !''

గేటు తీసుకుని బయటికొచ్చింది.

రవి రిక్షా మాట్లాడాడు.

''ఉమా ! మీ అన్నయ్యగారిని తీసుకుని మా ఇంటికోసారి రామ్మా !'' అంది.

''అదేమిటి ! నన్నొదిలేసి దాన్తో చెప్తారు ! మీకు తెలీదేమో, ఉమని నేనే తీసుకురావాలి,'' అన్నాడు రవి.

ఆ మాటతో ఫక్కున నవ్వింది స్వాతి.

రవి స్వాతి ముఖంలోకి పరవశంగా చూశాడు.

''మీరూ, ఉమా రండి '' అని రిక్షా ఎక్కింది స్వాతి.

రిక్షా కనుమరుగయ్యేవరకూ చూస్తూ నిలబడ్డారు రవీ, ఉమా.

* * *

స్వాతి తండ్రి గోవిందరావు రెవిన్యూ డిపార్ట్మెంటులో తాసిల్దారుగా చేసి రిటైరయ్యారు.

ఇద్దరు మగపిల్లల తర్వాత పుట్టిన స్వాతి అంటే తల్లి, తండ్రికీ అమిత గారాబం.

స్వాతి ఎమ్. ఎస్సీ ప్యాసయి, తర్వాత బి. ఇడి. చేసింది. వున్న వూళ్లో వుద్యోగం రావడంతో ఖాళీగ కూర్చోడం దేనికని ఉద్యోగంలో చేరింది.

కురిసిన ప్రతి చినుకూ ముత్యం కాదు ! ముత్యపు చిప్పలో పడితేనే ముత్యమౌతుంది !


అలాగే మంచి మనసున్న పురుషుని నీడలోనే స్త్రీ జీవితం ఆనందమయమౌతుంది !

స్వాతికి అనుకూలుడైన భర్త లభించి ఆమె జీవితం నందనవనం కావాలి ! స్వాతి చినుకు ముత్యపు చిప్పలో పడాలి ! మంచి ముత్యం కావాలి ! అటువంటి వరుని కోసం ఆయన గాలిస్తున్నారు.

* * *

''అమ్మా స్వాతీ ! నీకేదో ఉత్తరం వచ్చిందమ్మా !''

ఉమ పార్టీనుంచి ఇంటికి వచ్చి బట్టలు



[illegible] తిరుబడిగా కుర్చీలో కూర్చున్న స్వాతితో [illegible] గోవిందరావు

"ఎక్కడుంది నాన్నా ?"

"రేడియో కింద పెట్టానమ్మా !"

స్వాతి వుత్తరం తీసుకుని చదివింది అది రెండో అన్నయ్య రాసింది విశేషం ఏమీలేదు [illegible] చదువుతుండగా —

"ఎవరు రాశారమ్మా !" అడిగాడు గోవిందరావు

"చిన్నన్నయ్య రాశాడు నాన్నా ! శెలవలకు ఎప్పుడొచ్చినా వదిన కూడా నన్ను చూడాలను కుంటోందిట !"

"వెడతావా ?"

"ఇంకా పిల్లల పరీక్షలు కావాలి కదా ! చూద్దాంలే నాన్నా" అంది.

కాస్సేపు తండ్రితో కాలేజీ విషయాలు చెప్పింది

"స్వాతి ! భోజనానికి రా !" అంటూ లోపలి నుండి తల్లి పిలిచింది !

స్వాతి లేచి వంటింట్లోకి వెళ్లి - "ఆకలిగా లేదమ్మా ! ఒక గ్లాసుడు పాలు ఇవ్వు "

"అదేమిటే ? వేడి చేస్తుంది కొద్దిగా మజ్జిగ అన్నం తిను "

"ఊహు వద్దమ్మా !"

"సరే, నీ ఇష్టం !" అంటూ గ్లాసుతో పాలు ఇచ్చింది

అవి తాగి తన గదిలోకెళ్లి పడుకుంది స్వాతి.

కళ్లు మూసుకుంది. నిద్ర రావటంలేదు. కళ్ళముందు రవి మెదిలాడు. 'రవి' ఎంత చక్కని పేరు ! పేరు కంటే అందంగా వున్నాడు.

దానికి తోడు ఆ మాటలు ! నన్ను రోజూ చూస్తున్నట్టు ! నాతో పరిచయం చేసుకోవాలను కున్నట్టు !

'ఎందుకో ?'

ఏదో పోగొట్టుకున్న వస్తువు దొరికినట్లు తనని చూడగానే అతని కళ్లు ఎందుకలా మెరిశాయి?

అతని అందమంతా ఆ కళ్ళల్లోనే వుంది ! వెంటనే తనని తాను సంబాళించుకుంది. ఛ! ఏమిటిది? పరాయి వ్యక్తిని గూర్చి ఈ ఆలోచనలేమిటి ! అనుకుంటూ బలవంతంగా మనసుని ఆ ఆలోచన్ల నుండి మళ్ళించుకుంది స్వాతి.

* * *

ఆ మర్నాటి నుంచీ సాయంత్రం పూట ఆమెకు తెలీకుండానే ఆమె మనసు రవికోసం ఎదురు చూడసాగింది.

రవి వస్తానన్నాడు ! కానీ రాలేదు ! ఎందుకు రాలేదో ? వస్తే బాగుణ్ణు !

కాలేజికి వెళ్లేదారిలో అతని కోసం చూసింది. కానీ కన్పించలేదు పోనీ ఉమని అడిగితే ! ఛీ! ఆ పిల్ల ఏమనుకుంటుంది ? 'మేడమేమిటి ? ఇలా అడుగుతోంది' అనుకుంటుంది. ఆ పిల్ల ముందు చులకన కావడమా ? మరి రవి ఎందుకు రాలేదో ఎలా తెలుస్తుంది ? అయినా రవి వస్తానన్నాడే గానీ ఎప్పుడో చెప్పలేదుగా ! ఇప్పుడిప్పుడే రాడేమో ? అయినా ఇదేమిటి !

అతని కోసం ఇలా కలవరిస్తోంది !

# ప్రేమిస్తే ఏమౌతుంది?

అతనెవరు ?

తనెవరు ?

అలా —

ఎంత సర్దిచెప్పుకున్నా ఆమె మనసు అతని కోసం ఎదురు చూడ్డం మానలేదు.

మూడురోజులు గడిచాయి.

నాల్గోరోజు సాయంత్రం కాలేజీనుంచి వచ్చి కాఫీ తాగి, వరండాలో కుర్చీవేసుకూర్చుని ఏదో పుస్తకం తిరగేస్తోంది స్వాతి.

గేటు చప్పుడయింది. పుస్తకంలోంచి తల పైకెత్తింది స్వాతి.

రవి నవ్వుతున్నాడు.

స్వాతి ముఖం వికసించింది. గబుక్కున కుర్చీలోంచి లేచి —

"రండి ! రండి !" అంటూ రవిని తన గదిలోకి తీసికెళ్లి కూర్చోబెట్టింది.

రవి కుర్చీలో కూర్చున్నాడు

"ఉమ రాలేదా ?" అని ప్రశ్నించింది స్వాతి.

## ఆ కాం క్ష

ఆలయంలో చల్లని దేవుడు మాట్లాడుతుంటె చూడాలనీ

ఆకాశంపై వున్న బంగారు చందమామ నవ్వు తుంటె చూడాలనీ

ముత్యాల పల్లకిలో ముద్దుల చెల్లెను అత్త వారింటికి సాగనంపుతుంటె చూడాలనీ

మల్లెపూల మధుర తీరంలో నవకన్యలు జలకా లాడుతుంటె చూడాలనీ

దోసిటలో వున్న సిరిమల్లెపూవులు ఆణిముత్యాలై అందంగా రాలుతుంటె చూడాలనీ

అందిమైన చిత్రకారుడు శిల్పసుందరి రూపు రేఖలు చిత్రీకరిస్తుంటే చూడాలనీ!

**- మశేకార్ రమేష్**

రవి నవ్వుతూ — "ఉమెందుకు మన మధ్య?" అన్నాడు.

అదే ! ఆ చొరవే ! ఎన్నో ఏళ్ల పరిచయ మున్న వాడిలా మాట్లాడుతాడు.

దానికితోడు — అయస్కాంతంలా లాగే అతని చిరునవ్వు ! తనవేపు చూసినపుడు తళుక్కుమనే అతని కళ్ళు.

ఇవే ! తనని ఆకర్షించినవి.

"ఈ మూడు రోజులూ రాలేదే ?" అప్రయత్నంగా అంది.

"ఏం ? ఎదురు చూశారా !" నవ్వుతూ అన్నాడు.

స్వాతి సిగ్గుపడుతూ తలొంచుకుంది.

"మీరెదురు చూడాలనే రాలేదు ! మూడు రోజులు ఎదురు చూశారు ! ఇప్పుడు కలుసుకున్నాం! కలయికలోని మాధుర్యం ఇప్పుడు బాగా తెలుస్తుంది! ఏమంటారు ?"

కలయికలోని మాధుర్యం ఏమోగానీ, అతని మాటలు మాత్రం మధురంగా వున్నాయి.

ఆ తర్వాత రవి తన కంపెనీ విషయాలు చెప్పాడు

స్వాతి కాలేజీ విషయాలడిగాడు.

"స్వాతీ ! ఒక విషయం చెప్పనా?" హఠాత్తుగా అన్నాడు.

స్వాతి తలెత్తి ఆశ్చర్యంగా చూసింది

"ఎందుకలా చూస్తున్నారు ! స్వాతీ అని పిలిచినందుకా ? నాకీ పేరు ఇష్టం ! మిమ్మల్ని అలా పిలవడం మరీ ఇష్టం ! ఏం కోపం వచ్చిందా ?"

"లేదు ! లేదు ! మీరలాగే పిలవండి !" అంది స్వాతి

"పిలుస్తాను ! మీరు వద్దన్నా పిలుస్తాను ఈ మూడు రోజులూ నా మనస్సులో ఎన్నిసార్లు పిలుచుకున్నానో తెలుసా !"

స్వాతి మాట్లాడలేదు

"స్వాతీ ! సంవత్సరం నుండి మిమ్మల్ని చూస్తున్నాను మీతో పరిచయం చేసుకోవాలనీ, మీతో మాట్లాడాలనీ ఎంత తపించిపోయానో మీకు తెలీదు మీరు కాలేజీలో పని చేస్తున్నారని మాత్రం తెలుసు కానీ ఎలా కలుసుకోవాలి ! ఎలా మాట్లాడాలి ? ఇలా ఆలోచిస్తూ రాత్రిళ్ళు నిద్రకు కూడా దూరమయ్యేవాడిని.

ఉమ పుట్టిన రోజు వచ్చింది 'ఉమ' ఎవర్ని పిలుస్తావమ్మా' అంటే — 'మా స్వాతీ మేడమ్‌ని పిలవాలనుకుంటున్నాను' అంది

నాకు మీ పేరు స్వాతి అని తెలీదు ఉమ పిలిచే మేడమ్ మీరే కావాలి ! మీరే కావాలి ! ఉమ చెప్పిందగ్గర్నించీ దేవుడిని ప్రార్థిస్తూ వచ్చాను దేవుడు నా ప్రార్థనలు విన్నాడు. ఉమ 'మా మేడమ్‌ని చూద్దువుగానీ రా అన్నయ్యా' అని పిలిచింది.

నేను భయపడుతూనే వచ్చాను. మిమ్మల్ని చూశాను. అప్పుడు నేను పొందిన ఆనందం వర్ణనాతీతం ! నాలో సంతోషం కట్టలు తెంచుకు పొంగింది. మిమ్మల్ని చూసిన ఆ సంతోషంలో ఏవేవో మాట్లాడేసాన‌ప్పుడు మీరేమీ అనుకోలేదు కదా !"

స్వాతి అతనివేపే చూస్తోంది

"ఏమిటలా చూస్తున్నారు ? ఇదంతా నిజమా? కల్పనా ! అనా ?"

"ఉహు ! కాదు - మీరు చెప్పేది నిజమని నాకు తెలుసు "

కొద్దిక్షణాలు మౌనంగా కూర్చున్నారిద్దరూ.

రవి స్వాతివేపే చూస్తున్నాడు రెప్పవాల్చకుండా

ఆ చూపుల్ని తట్టుకోలేక — "వుండండి ! ఇప్పుడే వస్తాను" అని స్వాతి లోపలికెళ్లి టీ తెచ్చిచ్చింది

"మీరూ?" అన్నాడు రవి స్వాతివేపు చూస్తూ.

"నేను మీరు వచ్చేముందే తాగాను !"

"నేనేనా తాగంది ! పోనీ షేర్, షేర్" అంటూ తను సాసర్లో పోసుకుని కప్పు స్వాతికిచ్చాడు

అయిదు నిముషాలు కూర్చుని లేచాడు - "వస్తా"నంటూ

'మళ్లీ ఎప్పుడు వస్తారు' అని అడగాలన్పించ

చింది స్వాతికి. కానీ అతడేమన్నా అనుకుంటాడేమో నన్నే బిడియంతో వూరుకుంది.

రవి తనే — "మళ్లీ వస్తాను" అన్నాడు.

స్వాతి తలూపింది.

"ఎప్పుడని అడగరే ?" అన్నాడు నవ్వుతూ.

"చెప్పండి !"

"ఎల్లుండి ఆదివారంగా ! సాయంత్రం అయిదింటికి వస్తాను' అని గేటు తీసుకుని వెళ్లిపోయాడు.

ఆ రాత్రి నిద్ర పట్టలేదు స్వాతికి. రవి మాటలే జ్ఞాపకం వస్తున్నాయి.

ఏడాది తనకోసం ఎదురు చూశాట్ట ! తనని గూర్చి ఆలోచిస్తూ రాత్రిళ్ళు నిద్ర కూడా పోలేదుట.

ఆడదానికి అంతకంటె ఏం కావాలి ? ఒక పురుషుడిచేత ప్రేమింపబడి, ఆరాధింపబడడం కన్నా స్త్రీ కోరుకునేదేముంది ?

మనసంతా తీయని అనుభూతితో నిండి పోయింది స్వాతికి.

* * *

ఆదివారం ఠంచనుగా అయిదింటికి వచ్చాడు రవి.

అతనొచ్చేసరికి గోవిందరావు ఇంట్లోనే వున్నాడు. స్వాతి తండ్రిని పరిచయం చేసింది. ఆయన కాస్సేపు రవితో మాట్లాడి వాకింగ్‌కి వెళ్లిపోయారు.

రవి, స్వాతి గదిలో కూర్చున్నారు.

"మీరు పాటలు బాగా పాడ్తారటగా !" రవి అన్నాడు.

"ఎవరు చెప్పారు ?" అంది స్వాతి.

"ఉమ చెప్పింది. నాకు పాటలంటే చాలా ఇష్టం. ఒక్క పాట పాడండి !"

స్వాతి అతని అభ్యర్థనని కాదనలేకపోయింది. మెల్లగా పాట అందుకుంది.

మధురమైన ధ్వని తరంగాలు గాలిలో వ్యాపించి చెవికి హాయిగా సోకుతుంటే మైమరచి వింటున్నాడు రవి.

పాట ఆగింది.

# ప్రేమిస్తే ఏమౌతుంది?

"అద్భుతంగా పాడారు !" అంటూ మెచ్చుకున్నాడు.

చిన్నగా నవ్వింది స్వాతి.

"నిజం స్వాతీ ! చాలా బాగుంది. సంగీతం నేర్చుకున్నారా ?"

"ఆఁ ! వీణ కూడా నేర్చుకున్నాను !"

"అయితే, ఒకరోజు మీచేత కచ్చేరీ పెట్టించాల్సిందే !"

స్వాతి నవ్వి వూరుకుంది.

క్షణం ఆగి అన్నాడు — "ఇంట్లో మీరొక్కరే అనుకుంటా ! ఎలా పొద్దు పోతుంది ?"

"ప్రస్తుతం ఒక్కదాన్నేనండీ ! అన్నయ్యలు ఉద్యోగాల నిమిత్తం వెళ్లిపోయారు. ఇంట్లో అమ్మ, నాన్నగారు, నేనూ. ఇక కాలక్షేపం అంటారా — పుస్తకాలున్నాయిగా !"

గది నాలుగువైపులా చూస్తూ — "ఇది మీ గదేనా ?" అని ప్రశ్నించాడు రవి.

"ఆఁ ! నా రీడింగ్ రూమ్ !" అంది స్వాతి.

ఎదురుగా వున్న పుస్తకాల రాక్‌ని చూస్తూ — "అవేనా, మీరు చదివే పుస్తకాలు ?" అంటూ లేచి పుస్తకాల రాక్ దగ్గరికెళ్లి — "చాలా వున్నాయ్ ! నాకూ పుస్తకాలంటే చాలా ఇష్టం !" అని, రెండు మూడు పుస్తకాలు చూసి పెట్టేశాడు.

"ఇప్పుడు రాస్తున్న రైటర్స్‌లో మీ కెవరంటే ఇష్టం ?" అని అడిగాడు స్వాతిని.

"నాకు అలాటి యిష్టాయిష్టాలేవీ లేవండి కనబడిన ప్రతి పుస్తకాన్ని చదవడం, బాగుంది అని అన్పించిన ప్రతి పుస్తకాన్ని కొని దాచుకోవడం, ఇదే నా హాబీ !" అంది స్వాతి.

"బాగుంది ! అయితే మనిద్దరి అభిరుచులూ ఒకటే నన్నమాట !"

ఒక పుస్తకం తీసుకుని కుర్చీలో కూర్చున్నాడు. నల్లని చీకటి తెరలు వ్యాపిస్తున్నాయి.

స్వాతి లేచి లైటు వేసింది.

రవి వాచీ చూసుకుంటూ — "ఇక శెలవిప్పిస్తారా ?" అన్నాడు.

స్వాతి దిగులుగా చూసింది. ఇంకాస్సేపు రవి మాటలు వినాలనివుంది. రవితో మాట్లాడుతుంటే గంటలు క్షణాల్లా దొర్లిపోతాయి.

రవి లేచి 'వస్తాను' అని వెళ్లిపోయాడు

స్వాతి అలాగే కుర్చీలో వెనక్కి వాలింది

* * *

రవి అప్పుడప్పుడు వస్తున్నాడు అరగంటో, గంటో కూర్చుని వెడుతున్నాడు.

ఉదయం లేచిన దగ్గర్నించీ సాయంత్రం ఎప్పుడవుతుందా ! అని ఎదురుచూస్తూ వుండేది స్వాతి.

క్లాసులో పాఠాలు చెప్తున్నా, ఏ పని చేస్తున్నా రవి మాటలే జ్ఞాపకం వచ్చేవి

ఒకరోజు స్వాతి అడిగింది — "నా గురించి అడిగారు, మరి మీ గురించేమీ చెప్పలేదు !"

"ఏం చెప్పను ! నాకు అమ్మ, రాధా వున్నారు."

స్వాతి ముఖం చిట్లిస్తూ — "రాధా ! ఆవిడెవరు ?" అంది.

"మా మావయ్య కూతురు ! చిన్నప్పుడే తల్లీ, తండ్రీ దూరమైతే మా ఇంట్లోనే పెరిగింది."

స్వాతి మనస్సులో అనుమానం రేగింది. 'మా మావయ్య కూతురంటే' రవికి కాబోయే భార్యన్న మాట ! ఆ వుద్దేశం లేకపోతే వాళ్లమ్మ గారు ఇంట్లో ఎందుకుంచుకుంటారు ?

"ఏదేమిటి ? హఠాత్తుగా అలా మౌనంగా అయిపోయారు ?"

"ఏంలేదు ! నేను మీ అమ్మగార్ని చూడొచ్చా!" అంది.

"ఓయస్ ! దానికేం. నెక్స్ట్ సన్‌డే తీసికెడతాను" అన్నాడు.

ఆ రాత్రి రోజూలా ప్రశాంతంగా నిద్రపోలేక పోయింది స్వాతి.

రవి తనని మోసం చెయ్యటంలేదు కదా ! ఇలా తన మనసులో ఆడుకుని చివరికి మావయ్య కూతురినే చేసుకుంటాడా ? అయినా మావయ్య కూతురున్నప్పుడు తనతో ఎందుకు స్నేహం చెయ్యాలి ? తనతో చేసేది ఒట్టి స్నేహమేమో ! తనమీద ప్రేమ లేదేమో !

ప్రేమ లేకపోతే తనతో ఎందుకలా తీయతీయగా మాట్లాడాలి ? తన మనసుని ఎందుకు కదిలించాలి?

తొలిసారిగా తనని చూసిన ఆ చూపులే జ్ఞాపకం వస్తున్నాయి స్వాతికి.

ఎదురు చూసిన ఆదివారం రానేవచ్చింది

సాయంత్రం నాలుగ్గంటలకు వచ్చాడు రవి.

స్వాతి అప్పటికే తయారయివుంది. రవికి 'టీ' ఇచ్చింది.

"వెడదామా !" అంది రవి టీ త్రాగాక.

రవి స్వాతి కట్టిన పసుపురంగు చీరని చూస్తూ —

"స్వాతీ ! ఈ చీరలో మీరు చాలా బాగున్నారు" అన్నాడు.

మరొకప్పుడైతే ఆ మాటలకు ఆనందించేది స్వాతి.

(ఇంకా ఉంది)

## దీక్షా మాలిక

విరిసింది హరివిల్లు
కరిసింది నా వొళ్ళు
సప్తవర్ణ సమ్మేళనం
సప్తార్ణవ సంక్షోభం !
అంతరంగపు టుదధిమదించి
ఆశయాల మణులు సేకరించి
ఉత్తుంగ తరంగ నినదముల
సొత్తంతా 'కనుపాపల్లో' కుదించి,
గర్జించే సింహాలను;
గాండ్రించిన బెబ్బులులను;
మండుతున్న సూర్యుణ్ణి;
గుండె గదిలో బంధించి,
ఉరికే కన్నీటితో
మురిగే మురికిని కడిగి,
సడలిన సత్వంలో
చేతన తత్వం చేర్చి,
నిశ్శబ్ద నిశిని విస్మరించి,
నిర్మల కాంతిని స్మరించి,
అరిష్టాల విషాన్ని హరించి,
ఆనంద కాహళి పూరించి,
అందిస్తున్నానీ లోకానికి !
అనమాన సందేశ కానుక !
ఆశిస్తున్నా నీ తరంవారి పూనిక !
అచంచల దీక్షాయుత మాలిక !!

— పి. కామేశ్వరరావు

పెద్దకథ



# ప్రేమిస్తే మమకారమా!

## విన్నకోట సుశీలాదేవి

(గత సంచిక తరువాయి)

కాని ఈ రోజు మనసంతా చికాగ్గా, అశాంతిగా వుండటంవలన ఆ మాటలకు ఏం సమాధానం చెప్పలేదు.

రవి స్వాతి ముఖంలోకి చూశాడు.

రోజూ కన్పించే వెలుగు ఈనాడు ఆమె ముఖంలో లేదు.

"స్వాతి! మీరు మా ఇంటికి వచ్చిన తర్వాత మీకేదైనా అనుమానముంటే నన్నడగండి! అంతేకాని మనసులో పెట్టుకుని బాధపడకండి!" అన్నాడు.

స్వాతి రవి ముఖంలోకి చూసింది! రవి కళ్ళల్లో ఏ భావం కన్పించిందో కానీ —

'అలాగే' నంటూ తలూపింది.

"ఇక వెళ్దామా!" అంటూ రవి లేచాడు.

స్వాతి ఇంట్లోకి వెళ్ళి తల్లితో చెప్పి రవితో బయటికి నడిచింది. ఇద్దరూ బస్సెక్కారు.

బస్సు దిగాక రవి అన్నాడు —

"కొద్ది దూరమే నడుస్తారా?"

"ఊఁ" అంది స్వాతి.

రెండు సందులు తిరిగి ఒకచోట ఆగాడు.

"స్వాతీ! ఇదే మా ఇల్లు!"

ఎదురుగా చిన్న డాబా కన్పించింది. గేటు తీస్తూ — "రండి!" అన్నాడు. ఇద్దరూ లోపలి కెళ్ళారు.

ఇంటిముందు చక్కని పూలతోట వుంది. ఇల్లు చిన్నగా వున్నా అందంగా వుంది.

వరండా దాటి హాల్లోకి నడిచారు! స్వాతిని 'కూర్చో' మని తను లోపలికెళ్ళి అమ్మనీ, రాధనీ పిల్చుకొచ్చాడు.

"ఈవిడే మా అమ్మగారు. పేరు శారదమ్మ. ఈ అమ్మాయి రాధ!"

"అమ్మా! వీరు స్వాతి అని నా ఫ్రెండ్!" అంటూ పరస్పరం పరిచయం చేశాడు రవి.

స్వాతి నమస్కారం చేసింది.

రవి తల్లికి దాదాపు యాభై ఏళ్ళుంటాయి. సన్నగా, తెల్లగా వుంది.

స్వాతి రాధవేపు చూసింది. రాధ చామన ఛాయతో ఆకర్షణీయంగానే వుంది.

"కూర్చోమ్మా!" రవి తల్లి అంది.

స్వాతి కూర్చుంది!... స్వాతి తెలిసినవాళ్ళతోనే సరిగ్గా మాట్లాడలేదు. కొత్తవాళ్ళతో అస్సలు మాట్లాడదు.

శారదమ్మగారే స్వాతి కుటుంబ విషయాలు అడిగింది.

ఈలోగా రాధ కాఫీ తెచ్చిచ్చింది.

స్వాతి చూపంతా రాధమీదే వుంది.



రాధ నడకలోనూ, మాటల్లోనూ ఏదో ప్రత్యేకత కన్పించింది స్వాతికి. రవి స్వాతినే గమనిస్తున్నాడు.

"రాధా! వారికి ఇల్లు చూపించు" అన్నాడు రవి.

రాధ ఇల్లంతా చూపుతూ ఒక గదిలోకి తీసికెళ్ళి —

"ఇది బావ గది! బావకి బొత్తిగా శుభ్రం తెలీదండి! సామాన్లు ఇష్టంవచ్చినట్లు పడేస్తాడు. నేనే సర్దాలి! నేను సర్దితే మాత్రం, రాధా ఇప్పుడు ఈ గదిలో కాస్త వుండబుద్ధవుతోంది అంటూ మెచ్చుకుంటాడు" అంది.

నిగతా గదులకంటె ఆ గది చాలా అందంగా వుంది. తర్వాత దొడ్లోకి తీసికెళ్ళి మొక్కలు చూపించింది.

"నాకు మొక్కలంటే సరదా! ఇవన్నీ నేను కొని వేసినవే" అంది రాధ.

ఒక ప్రక్కగా వున్న గులాబీలను చూపుతూ —

"బావకు గులాబీలంటే చాలా ఇష్టం! బావ కోసమని తెప్పించి పెంచుతున్నాను" అంది.

రాధ ప్రతి మాటలోనూ ఆ పిల్లకు రవిమీద గల ప్రేమ వ్యక్తమౌతోంది. అది స్వాతికి రంపపు కోతలావుంది.

"రండి! వాకిట్లోకి వెళ్ళి అక్కడున్న మొక్కలు చూద్దాం" అంది రాధ.

రాధ నోటి వెంట ఇక రవి పేరు వినలేదు. అందుకే —

"ఇందాక వస్తుంటే ఆ మొక్కలు చూశాను" అంది స్వాతి.

ఇద్దరూ హాల్లోకి వచ్చారు.

**జరిగిన కథ—1 :** రెవిన్యూ డిపార్ట్‌మెంటులో తాసిల్దారుగా పనిచేసి రిటైరయిన గోవిందరావుకు, ఆయన భార్యకు ఇద్దరు మగ పిల్లల తర్వాత పుట్టిన స్వాతి అంటే అమితమైన గారాబం. స్వాతి ఓ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తూంటుంది. ఉమ కోరికమీద ఆమె బర్త్‌డే పార్టీకి వెళ్ళిన స్వాతికి అక్కడ రవి పరిచయమౌతాడు. స్వాతి ఇంటికి రవి రాకపోకలు సాగిస్తుంటాడు. ఆమెలో అతను చోటు చేసుకొంటుంటాడు. రవి మాటల్లో తన మావయ్య కూతురు రాధ విషయం రాగా ఎందుకో అతను తనని మోసం చేస్తున్నాడేమో! అనే అనుమానం చిగురుస్తుంది స్వాతిలో.

రవి అలాగే కూర్చున్నాడు. శారదమ్మ వంటింట్లో పనిమీద వుంది.

స్వాతి వంటింటి గుమ్మం దగ్గరికొచ్చి — "వెళ్ళొస్తానండి" అంది.

ఆవిడ స్వాతివేపు చూస్తూ — "వుండమ్మా! కాస్త టిఫిను తిని వెడుదువుగానీ" అంది.

"లేదండీ! మళ్ళీ బస్సులు అందవు. ఇప్పటికే చీకటి పడింది. ఇంకోసారి వచ్చినప్పుడు తప్పక తింటాను" అని హాల్లోకి వచ్చి రవితో — "వెళ్ళొస్తానని" చెప్పింది.

రవి లేచి స్వాతి వెంట నడిచాడు. గేటు వరకూ వచ్చిన రాధతోకూడా చెప్పి గేటు తీసుకుని బయటకు వచ్చింది స్వాతి.

రవి, స్వాతి ప్రక్క ప్రక్కన నడుస్తూ బస్ స్టాప్ చేరారు.

"స్వాతీ! రేపు వస్తాను మీ ఇంటికి."

స్వాతి ఏం సమాధానం చెప్పలేదు. రవి ఏదో అనబోయి స్వాతి ముఖం చూసి వూరుకున్నాడు.

స్వాతి బస్సెక్కాక రవి చెయ్యి వూపాడు. స్వాతి ముఖం తిప్పుకుంది. రవి మనస్సులో సన్నటి బాధ పీచిక రేగింది.

ఆక్షణంలో స్వాతి వెనకే బస్సెక్కి ఆమె ఇంటికి వెళ్ళాలన్పించింది. కాని బలవంతాన నిగ్రహించుకున్నాడు.

* * *

ఆ మర్నాడు అయిదవుతుండగానే స్వాతి ఇంటికి వెళ్ళాడు రవి.

అప్పటికింకా స్వాతి ఇంటికి రాలేదు. పుస్తకం తిరగేస్తూ గదిలో కూర్చున్నాడు.

పావుగంట గడిచాక వచ్చింది.

రవి ఆత్రంగా స్వాతి ముఖంలోకి చూశాడు. ఇంకా స్వాతి ముఖంలో నీలినీడలు కదలాడుతూనే వున్నాయి.

"స్వాతి! నిన్న మీరు వెళ్ళిన తర్వాత ఎంత మానసికవేదన అనుభవించానో తెలుసా! రాత్రి నిద్ర పట్టలేదు. ఎప్పుడెప్పుడు సాయంత్రం అవుతుందా! ఎప్పుడు మిమ్మల్ని కలుసుకుంటానా? అని ఎంతో ఆరాటపడిపోయాను."

రవి కంఠంలోని ఆవేదనకి చలించిపోయింది స్వాతి. మనస్సు బాధగా మూలిగింది. అదే!... అదే! ఆ మాటలే! తనని నిలువునా స్పందింపచేసేవి. అవే రవిమీది కోపాన్ని పటాపంచలు చేసేవి.

రవీ! మీ మాటల్లో ఎందుకంత తియ్యదనం!

మీ చూపుల్లో ఎందుకంత మెరుపు!

రవితో అస్సలు మాట్లాడవద్దనుకుంది. అతనివేపే చూడొద్దనుకుంది. ఒకవేళ మాట్లాడినా రాధ విషయం చెప్పనందుకు పోట్లాడాలనుకుంది. కానీ, ఏం చెయ్యలేకుండా వుంది. ఎందుకీ బలహీనత తనలో? ...

"స్వాతీ!"

స్వాతి కుర్చీమీద పెట్టుకున్న చేతిని పట్టుకుని చిన్నగా ముద్దు పెట్టుకున్నాడు.

స్వాతి ఈ హఠాత్సంఘటనకు వణికింది.

కానీ ఏదో తియ్యటి అనుభూతి నరనరాన పాకింది.

'రవీ! నేను పూర్తిగా ఓడిపోయాను' అనుకుంది.




"స్వాతీ ! మీరలా మౌనంగా కూర్చుంటే నేను చూడలేను. ఏదన్నా మాట్లాడండి. అసలెందుకలా వున్నారు ? నా మీద కోపమా ?"

స్వాతి కాదన్నట్టు తలూపింది.

"మరి ?"

"కోపం కాదు. బాధ రవీ ! నన్ను మోసం చెయ్యకండి ! అదే నేను కోరేది" పళ్ళబిగువున అంది.

రవి తన చేతిలోవున్న స్వాతి చేతిని మృదువుగా నొక్కి — "స్వాతీ ! ఏం మాటలవి. నా దేవతకు నేనెన్నడైనా ద్రోహం చేస్తానా ? అలా ద్రోహం చేసిన రోజున ఈ రవి జీవించి వుండడు !"

రవి కంఠం ఆవేశంగా పలికింది.

"రవీ !"

అంతకంటె ఎక్కువ మాట్లాడలేకపోయింది స్వాతి.

* * *

"స్వాతీ ! ఈ మధ్య సాయంత్రాలు తమ దర్శనమే కరువైపోతోంది !" కళ్యాణి నిష్ఠురంగా అంది.

స్వాతి నవ్వుతూ — "ఏంలేదే ! పనుండి."

"పనా ! రోజూనా ! అంత తీరికలేని పను లేమిటో ?"

స్వాతి సమాధానం చెప్పలేకపోయింది. కళ్ళు మాత్రం సిగ్గుతో వాలిపోయాయి. స్వాతి పరిస్థితి చూసి కళ్యాణి — "నేను చెప్పనా ?" అంది నవ్వుతూ.

"ఊ..."

"ఏవుందీ ! అమ్మాయి గారు ప్రేమలో పడ్డారు. అంతేనా ?"

కళ్యాణి అలా కుండ బ్రద్దలు కొట్టినట్టు చెప్పేసరికి స్వాతి సిగ్గుపడిపోయింది.

"చెప్ప ?"

స్వాతి 'అవున'న్నట్టు తలూపింది.

కళ్యాణి చటుక్కున స్వాతి దగ్గరగా కుర్చీ జరుపుకుని రహస్యంగా — "ఎవరా అదృష్ట వంతుడు ?" అంది. స్వాతి నవ్వుతూ — "వివరాలు వెండితెరమీద !" అంది.

"చాల్లే ! నా దగ్గర కూడా దాపరికమేనా ?" అంటూ కోపగించుకుంది కళ్యాణి.

"అదికాదు కళ్యాణీ ! కొన్నాళ్ళు ఓపికపట్టు ! నేనే అతన్ని మీ ఇంటికి తీసుకొచ్చి పరిచయం చేస్తాను."

"పోనీ ! కనీసం ఫోటో అయినా లేదా ?"

స్వాతి కళ్యాణి ముఖంలోకి చూసింది.

"ప్లీజ్ స్వాతీ ! చూపించవా ! ఈ అందాల బొమ్మ వరించినవాడు ఎంత అందగాడో తెలుసు కోవాలని ఆరాటంగా వుంది. నామీద ఆమాత్రం దయలేదా !" బ్రతిమాలింది కళ్యాణి.

స్వాతి నవ్వుతూ టేబిల్‌మీద వున్న బ్యాగ్ చేతిలోకి తీసుకుంది.

"ఓహో ! ఫొటో బ్యాగులో వుంచుకునే తిరుగుతున్నావన్న మాట ! అయితే టెంపరేచర్ చాలా ఎక్కువగానే వుందే !"

స్వాతి సిగ్గుపడుతూ — బ్యాగ్‌లోంచి ఫొటో తీసి కళ్యాణి చేతిలో పెడ్తూ —

"ఎవ్వరికీ చెప్పకు !" అంది భయంగా చూసి.

"ఛ ! ఎందుకు చెప్తాను ? నాకు మాత్రం తెలీదా !" అంటూ ఫొటో చూసింది !... దాంతో నవ్వుతున్న కళ్యాణి ముఖం ముడుచుకుంది.

"స్వాతీ ! నువ్వు ప్రేమించింది ఇతడినా !" అంది.

"అవును. ఏం ?" — అదే భయం స్వాతిలో.

"స్వాతీ ! చాలా పొరపాటు చేశావ్ !" —

"కళ్యాణీ ! అసలు విషయం చెప్పవే !" అడిగింది మరీ భయంగా — "రవికి పెళ్ళయిందే !" కళ్యాణి గట్టిగా చెప్పింది.

స్వాతి అదిరిపడింది ! !

"నిజమా కళ్యాణీ !"

"పెళ్ళంటే ! ఒక విధంగా అయినట్లేనే ! అతనికి రాధ అనే మావయ్య కూతురుంది. చిన్నప్పుడు ఆ పిల్ల తండ్రి చనిపోయే సమయంలో ఆ పిల్లని చేసుకుంటానని దేవుడిముందు నిలబడి ప్రమాణం చేశాడు. ఆ తర్వాత తండ్రి పోయాక రవి తల్లి ఆ పిల్లని తెచ్చి పెంచింది. రాధ ఆ ఇంటి కోడలుగానే పెరిగింది. శారదమ్మ అలాగే చూసింది. రవికీ ఆ భావనే వుండేది. స్వాతీ ! అసలు రవి నీకెలా పరిచయం అయ్యాడే ?"

కళ్యాణి చెప్తున్న ప్రతి మాటా స్వాతి గుండెల మీద సమ్మెటలతో కొడ్తున్నట్లనిపించింది.

'రవికీ ఆ భావనే వుండేది...', 'రవికీ ఆ భావనే వుండేది !...' అన్న మాటలే చెవిలో గింగురు మంటున్నాయి !

"స్వాతీ ! ఇప్పటికైనా మించిపోయిందేంలేదు ! రవితో స్నేహం తెంచుకో ! లేకపోతే అనవసరంగా

[38 వ పేజీ చూడండి]

పూటిలోకి దిగిపోతావ్! నీదసలే సున్నితమైన మనస్సు."

"కళ్యాణీ! ఇప్పటికే కంఠంలోతు దిగిపోయానే!" ఏడుపుమొహం పెట్టింది స్వాతి.

"కళ్యాణీ! రవి నీకెలా తెలుసు!" అనడిగింది ఎట్టకేలకు.

"రవి మాకు దూరపు చుట్టం!"

ఇక మాట్లాడలేదు స్వాతి! ఇంతలో గంట కొట్టారు. లెక్చరర్లు ఒక్కొక్కరూ రాసాగారు! కళ్యాణి ఫోటో స్వాతి కిచ్చేసింది.

"స్వాతీ! ముఖమంతా కమిలిపోయింది. వెళ్ళి ముఖం కడుక్కురా! ఎవరన్నా చూస్తే బాగుండదు" అంది.

ఆ పూట ఎలాగో పాఠాలు చెప్పాననిపించింది. లాస్ట్ అవర్ ఖాళీ! ప్రిన్సిపాల్‌ని పర్మిషన్ అడిగి ఇంటికి వచ్చింది స్వాతి. తల్లి ఇచ్చిన కాఫీ తాగి తన గదిలో మంచంమీద వాలింది. ఇందాకట్నించీ గుండెల్లో దాగిన బాధ కన్నీళ్ల రూపంలో బయటి కొచ్చింది. తనిన్నాళ్లూ ప్రేమ కోసం ఎంత తపించిపోయింది!

ప్రేమించే హృదయం కోసం ఎన్నిరాత్రులు పిచ్చిదానిలా విలపించింది! లోకంలో అందరికీ డబ్బు కావాలి, అందం కావాలి! కాని మనసు అక్కర్లేదు! ప్రేమ అక్కర్లేదు!

తాను కోరుకున్న మనిషి కోసం ప్రతి వ్యక్తిలోనూ వెదికింది. తనకు కావాల్సిన ప్రేమ కోసమే ప్రతిచోటా చూసింది. ఇన్నాళ్ల తన

## ప్రేమిస్తే ఏమౌతుంది?

[28 వ పేజీ తరువాయి]

అన్వేషణ ఫలించినట్లుగా రవి కన్పించాడు. తనకు కావాల్సిన లక్షణాలన్నీ అతడిలో వున్నాయి.

ఆ రోజు —

అతడు పరిచయమైన రోజు ఎంత సంతోషించింది! ఎంత పొంగిపోయింది! రవి తను కోరుకున్న ప్రేమభిక్ష పెట్టాడు. కాని... కాని ఇవాళ చేదు నిజం తెలిసింది. తను పొందింది అమృతం కాదు విషం! తనకు లభించింది ప్రేమకాదు వంచన! "రవి! ఎందుకింత మోసం చేశావ్. నీ అందమైన నవ్వు వెనకాల ఇంత క్రూరత్వం వుందా?"

అట్లాగే తల్చుకుంటూ ఏడుస్తూ నిద్రలోకి జారుకుంది స్వాతి!

* * *

మర్నాడు కూడా కాలేజీకి వెళ్లబుద్ధికాక శెలవు పెట్టింది స్వాతి. సాయంత్రం వరకూ మంచంమీద పడుకుని దొర్లుతూ, ఆలోచిస్తూ గడిపింది.

సాయంత్రం అయిదింటికి స్నానం చేసి తన గదిలో కూర్చుంది స్వాతి. చేతిలో బసవరాజు అప్పారావుగారి గేయాల పుస్తకం వుంది. పేజీలు తిరగేస్తున్నదల్లా హఠాత్తుగా ఒక గేయం దగ్గర ఆగిపోయింది.

కళ్లూ, మనసూ ఏకాగ్రమయ్యాయి. అక్షరాల వెంట పరుగుతీశాయి.

ఎదమెత్తనౌటకై
పాదమందరా, అంత
మదిగల అహమెల్ల
వదలి పొవునురా!

ఎంత చక్కటి భావం! నిజంగా కవి అనుభూతిని పొంది చెప్పివుంటాడు.

వలపెరుంగక బ్రతికి
కులికి మురిసే కంటె,
వలచి విఫలమ్మైంది
విలపింప మేలురా!

తను వలచింది! విఫలం చెందింది! విలపిస్తోంది! ఇలా విఫలమైన ప్రేమకోసం ఏడ్చే కంటే, అసలు తను ప్రేమించకుండా వుంటేనే బాగుండేది.

చెలివతిపు లేని నీ
కలిమి కాల్పనె! వినుము
వలపు తీగనె జీవ
ఫలము కాయునురా!

లోకంలో ప్రేమలన్నీ ధనంతోనే ముడిపడి వున్నాయి.

ప్రేమకంటె ఎక్కు
వేముందిరా, ఎల్ల
కామ్య పదవులకన్న
ప్రేమే ఎక్కువరా!

అన్నిటికంటె స్వార్థం ఎక్కువ. తనలోని మోహానికి ప్రేమనే ముసుగేసుకుని స్వార్థ బుద్ధితో




# ప్రకటన్ల ప్రహసనం!

టికెట్ లేకండా
ఆర్టీసీ బస్సుల్లో
ప్రయాణం చెయ్యి
కూడదని ఆ మధ్య
సదరు మారాజులు
వివిధ్భారతి వాణిజ్య
ప్రసార్విభాగంలో
కొన్నాళ్ళ ఆంగ్లో ఇండ్యన్
యాసలో ప్రకటన్లు
చేస్తూండేవాళ్ళ
ఇంగ్లీషైతే గ్రామీణాం
ధ్రులందరికీ భయంగా
ఉంటుందని ఆర్టీసీ
యజమాన్లు ఆట్లా చే
సుంటారని కొందరైనా
అనుకోకపోతారా ?
అన్నది వాళ్ల ధైర్యం కాబోలు !

ఈమధ్య ప్రజాసేవయే
లక్ష్యంగా గల ఆర్టీసీ
ప్రజాధనం సద్వినియోగం
చేస్తూ మళ్లీ ప్రకటన్లు
చెయ్యసాగారు
ఈసారి టిక్కెట్ రేటు పెంచా
లన్న సదుద్దేశంతో
చేశారీ మంచి ఏర్పాటు !

*　*　*

ప్రకటన్లు చెయ్యడం
మంత్రులకే జన్మహక్కు
కుల విద్యయేమీ కాదు
సమాచార పౌర (సం) బంధ
శాఖవాళ్లా మధ్య
పుష్కరాల్లో ఇప్పుడు
24 సం॥ల ఆంధ్ర
ప్రదేశ్ రజతోత్సవాల్లో
భలేగా చేస్తూంటారు !
రేడియోలో పాటకీ
పాటకీ మధ్య ఇందిరమ్మ
20 సూత్రాలకీ
సంజయ్ 5 సూత్రాలకీ
ముడిపెట్టి, ఆంధ్ర
ప్రదేశ్ రజతోత్సవాలు
ఇరవై ఐదు రోజులు
చెయ్యమని చేస్తున్న
ప్రకటన్లు వినలేదా ?
ఇది కేంద్రానికి
రాష్ట్రం పెట్టే నివాళి
భాగుంది బహుబాగుందం
టూ అట్లాగే చేద్దాం
అని బయటికి ''పిల్లా

## సామాన్యుని సణుగుడు

జెల్లా'' సహా వెళితే
ఎదురొచ్చినవేమిటన్నా
అంటే పస్తుల నిరాకరణ
వూరేగింపుల
ఝుంఝూమారుతం !

దీపావళి మర్నాటినుంచి
దీపావళీ కానుకగా
మ్యునిసిపాలిటీ స్టాఫ్
ఇచ్చిన సమ్మె కార్క
ఫలితంగా రాష్ట్రంలో
చెత్తా చెదారాల
కుప్పలు ఎక్కడవక్కడ
పేరుకుపోయి
పబ్లిక్ పాయిఖానాలై
ముక్కున గుద్దినట్లు
వస్తున్న దుర్గంధం !

ఎందుకొచ్చిన తంటా
సర్కారువారు చేసే
సంభావనా సంబరాల
కథలు, పత్రికల్లోలో
ఏలినవారు వేయించే
మజా మజా ప్రకటన్ల
లోనో చదువు
కుంటామని తిరుగు
ముఖం పట్టాడు సామాన్యుడు
ఉత్సవాలకేం కొదవ
దిన వార కర్మల పేరిట
కూడా వీటిని చెయ్యొచ్చు
వివిధ్ భారతిలో
ట్రింగ్ ట్రింగ్ ప్రకటన్లు
అడపా తడపా వెయొచ్చు

ఇవి కొన్ని వ్యంగ్య
చిత్రాల కన్నా బాగా
నవ్విస్తాయి సామాన్యుడి
పొట్ట చెక్కలు చేస్తాయి
మచ్చుకు ఒకటి :
''ఇద్దరో ముగ్గురో
ఆహా... ఇదరో ముగురో
కావాలంటే కుటుంబం
సుఖంగా వర్థిల్లాలంటే
మీరూ నిరోధ్ వాడండి
నిరోధ్ వాడండి''

అంటూ సన్నాయి నొక్కులు
నొక్కే ప్రకటన ఉందే
అదండీ అసలైన ప్రకటన !

ఒక నిరోధ్‌కి
ఇదరో ముగ్గురో
పుడుతూవుంటే ...
ఇంకేముందండీ మన
పని అంతే సంగతులు !

*　*　*

బస్సులమీద రైళ్లల్లో
మరో ప్రకటన చూద్దాం
''అంటరానితనం నేరం''
అని అంతేసి అక్షరాల్లో
ఉంటుం దక్కడక్కడ !
ఇది ఘోరం ! ''అంటరాని,
తనం పాటించకండంటూ
రాజ్యాంగం ఘోష
పెడుతూవుంటే అదేదో
దొంగతనం లాగ
అంటరానితనం నేరం
అంటారేమిటో
గవర్నమెంట్ వాళ్ళ
వాళ్లకే తెలియాలి
వాళ్ల ప్రకటన్ల సారం !''

ఎందుకొచ్చిన
ప్రకటన్లు స్వామీ
సామాన్యుడి దుంప
తెంపడానికి తప్ప !

— వీ రా జీ

ఎదుటి వ్యక్తిని నిలువునా మోసం చేస్తున్నాడు మనిషి

ప్రేమించు సుఖముకై !
ప్రేమించు ముక్తికై
ప్రేమించు ప్రేమకై
ఏమింక వలెనురా !

నిజమైన ప్రేమకు ఈ లోకంలో తావే లేదు ! ఇలా కావ్యాల్లో మాత్రమే మిగిలివుంది గేయంలో లీనమైన స్వాతి హృదయం మెత్తని అడుగుల చప్పుడు విన్పించగానే ఒక్కసారి ఝల్లుమంది !

అవి తనకెంతో పరిచయమైన అడుగులు. అవి రవివి !

కానీ స్వాతి తన గదిలోంచి బయటికి రాలేదు ! కుర్చీలోంచి లేవలేదు !

''అమ్మా స్వాతీ! రవి వచ్చాడమ్మా!'' నాన్నగారు పిలుస్తున్నారు. తండ్రి ఎదుట తేలికపడటం ఇష్టంలేక పుస్తకం పక్కన పెట్టి లేచి బయటి కొచ్చింది.

రవి గదిలోకి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. తన వెనకాలే వచ్చిన స్వాతి ముఖంలోకి చూశాడు. ఆ ముఖం అప్రసన్నంగా వుంది !

''స్వాతీ ! అలా వున్నావే ?'' అన్నాడు స్వాతి వేపు చూస్తూ

స్వాతి కళ్ళు వర్షించబోయే మేఘాల్లా వున్నాయి. టేబిల్‌మీద వున్న స్వాతి చేతిని అందుకో బోయాడు. స్వాతి చటుక్కున చెయ్యి వెనక్కు లాక్కుంది ! రవి నొచ్చుకున్నాడు.

''స్వాతీ ! నేనేదైనా తప్పుచేస్తే శిక్షించండి !''

స్వాతి పెదాలు బిగపట్టింది.

''స్వాతీ ! మిమ్మల్ని చూడాలనీ, మీ మాటలు వినాలనీ, మీ చిరునవ్వు చూసి తరించాలని అంత దూరం నుంచి వచ్చాను. అటువంటప్పుడు నన్నిలా బాధపెట్టడం న్యాయమా ! స్వాతీ ! ఒక విషయం చెప్పనా ! ఈమధ్య ఆఫీసులో అస్సలు పని చేయలేకుండా వున్నాను. ఏ కాగితం తీసినా మీరే కన్పిస్తున్నారు ! రాత్రిపూట నిద్దట్లో మీ పేరు కలవరిస్తానేమోనని ఎంత భయంగా వుందో తెలుసా ! స్వాతీ ప్లీజ్ ! మాట్లాడండి !''

మేఘాలు వర్షించాయి !

''రవీ'' అంటూ రెండు చేతుల్లోనూ ముఖం దాచుకుంది స్వాతి.

రవి కుర్చీలోంచి లేచి స్వాతి చేతుల్ని తొలగించి కన్నీటిని తుడిచాడు.

రవి కళ్ళల్లోకి చూస్తూ — ''రవీ ! నన్నెందు కిలా బాధపెడ్తారు ?'' అంది బేలగా

# ప్రేమిస్తే ఏమౌతుంది?

రవి స్వాతి ముఖం పైకెత్తి, పళ్లమధ్య నలిగి ఎరుపురంగుని పులుముకున్న స్వాతి పెదవులపై గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు.

స్వాతి చటుక్కున తలొంచుకుని రెండు చేతుల్తోనూ ముఖం కప్పుకుంది. రవి తిరిగి కుర్చీలో కూర్చున్నాడు.

"స్వాతీ! సరిగ్గా కూర్చోండి! అసలు ఎందుకలా బాధపడుతున్నారు? మీ మనస్సులో ఏదైనా వుంటే చెప్పడగండి."

స్వాతి ఆ ప్రార్థనకు కరిగిపోయింది. ముఖం కొంగుతో తుడుచుకుని సరిగ్గా కూర్చుంది.

"మీరు దేన్నిగూర్చి బాధపడుతున్నారో చెప్పనా?"

"..............."

"రాధని గూర్చి ఆలోచిస్తున్నారు కదూ!"

ఈసారీ మాట్లాడలేదు స్వాతి.

"స్వాతీ! మీ అనుమానం నాకు తెలుసు! నేను మిమ్మల్ని మోసం చేసి రాధని చేసుకుంటానని కదూ! స్వాతీ! మీ కళ్లకు నేనంత మోసగాడిగా కన్పిస్తున్నానా! రాధంటే అభిమానముంది! గౌరవముంది! మీరు కన్పించకపోతే రాధనే చేసుకునేవాడినేమో! అది వేరే విషయం! నేను రాధని ప్రేమించలేదు. నాకు ప్రేమ కావాలి! నా మనస్సుకు తృప్తికావాలి! అవి ఇచ్చే వ్యక్తికోసం వెదికాను. నా తపస్సు ఫలించి మీరు లభించారు. స్వాతీ! ఇదివరకోసారి చెప్పాను. మళ్లీ చెప్తున్నాను! మీ ప్రేమ లభించని రోజున ఈ కాస్త గుండె ఆగిపోతుంది. అదే మీ కిష్టమైతే ..."

స్వాతి చటుక్కున అందుకుని — "రవీ! అలా మాట్లాడకండి! ఏదో బాధలోవుండి ..." అని తలొంచుకుంది.

"అదే వద్దన్నాను. ఎందుకు బాధపడాలి! మీరలా బాధపడుతూంటే నేనెంత కుమిలిపోతానో తెలుసా! ఇంకెప్పుడూ అలా వుండకండి! తెలిసిందా!"

స్వాతి బుద్ధిమంతురాలిలా తలూపింది.

"ఊఁ! ఇక ఇప్పుడు మాట్లాడండి!" అని కుర్చీలో వెనక్కి వాలాడు.

"ఏం! మాట్లాడను?"

"ఏదన్నా సరే! మీ నోటినుండి ఏం వచ్చినా బాగుంటుంది. పోనీ కాస్సేపు నన్ను తిట్టండి!"

స్వాతి ఫక్కున నవ్వింది.

"అమ్మయ్య! ఎలాగైతేనేం దేవిగారు నవ్వారు."

"రవీ! మీకింత బాగా మాట్లాడ్డం ఎవరు నేర్పారు?" స్వాతి సీరియస్‌గా ప్రశ్నించింది.

ఆ మాటకి పకపకా నవ్వాడు రవి.

"ఇంకెవరు నేర్పుతారు. మీరే! మీ ముఖం చూస్తుంటే మాటలు అలా వచ్చేస్తుంటాయి" అంటూ ఆమె ముఖంలోకి కొంటెగా చూశాడు.

"అలాగేం!" అని మూతి బిగించింది.

"అదిగో మళ్లీ! నవ్వుతూ వుండమని చెప్పలా!"

"చిత్తం! దొరగారి ఆజ్ఞ."

వాతావరణం తేలికయింది. పది నిముషాలు కూర్చుని లేచాడు రవి "వస్తానూ" అంటూ.

స్వాతి నవ్వుతూ 'అలాగే' అంది.

రవి స్వాతివేపు చూస్తూ — "స్వాతీ! మీ పెదవులు పిలుస్తున్నాయి రానా!" అన్నాడు కొంటెగా.

స్వాతి బుగ్గలు ఎర్రబడ్డాయి. "ఛీ! ఫో!" అంటూ ముఖాన్ని చేతుల్తో కప్పుకుంది.

"పోనీలే! రేపు వడ్డీతో సహా తీసుకుంటాను. బై! బై!" అంటూ వెళ్లిపోయాడు.

స్వాతి పెదవులపై వేలితో రాసుకుంది. రవి గెడ్డం గుచ్చుకుని పెదవులు ఇంకా మండుతూ వున్నాయి.

'సంధ్య' లో ఒక సన్నివేశం



రవికి ఎంత ధైర్యం! ఎంత చొరవగా హఠాత్తుగా వచ్చి ముద్దు పెట్టుకున్నాడు. తలచుకున్న కొద్దీ మనసు పరవశించిపోతోంది. అయినా మగాడిలో ఆ మాత్రం చొరవ, ధైర్యం లేకపోతే ఏం బాగుంటుంది!?

అతడు మోసగాడు కానీ, రౌడీకానీ అతడిని తను వదులుకోలేదు. వదిలి జీవించలేదు. అతని తియ్యని మాటలు వినకుండా క్షణం వుండలేదు. అతడి చిరునవ్వునీ, ఆ కళ్లల్లోని మెరుపునీ, అన్నిటికీ మించిన అతని తియ్యటి ముద్దునీ వదులుకోలేదు. వదిలి జీవించలేదు!...

*  *  *

ప్రేమ గుడ్డిది అన్నారు. అది నూటికి నూరుపాళ్లూ నిజం!

ప్రేమకోసం ఏడ్చినవాళ్లున్నారు!

బాధపడ్డవాళ్లున్నారు!

త్యాగం చేసినవాళ్లున్నారు!

ఆత్మహత్యలు చేసుకున్నవాళ్లున్నారు!

ప్రేమలో సుఖంకన్నా దుఃఖమే ఎక్కువగా వుంటుందంటారు. అది నిజమే! ప్రేమ ఎంత తియ్యగా వున్నా ప్రేమికులకు నిరంతరం బాధా, ఆవేదనే మిగిలింది! ఎందుకనీ? సంఘము, పరిస్థితులవలనా! స్వాతి ఒళ్లో పుస్తకం పెట్టుకుని వెనక్కి వాలి ఆలోచిస్తోంది. రవి రెండు రోజులయింది వచ్చి.

ఎందుకు రాలేదో! మనసంతా ఏదో దిగులుగా వుంది. ఏదో పోగొట్టుకున్నంత శూన్యం! చికాకు!

ఏ పనీ చెయ్యబుద్ధి కాదు! అన్నం తినాలన్పించదు! నిద్రపట్టదు!

రవి కోసం తనెందుకు బాధపడాలి!

రెండు నెలల క్రితం అతని ముక్కూ ముఖం తనెరగదు.

ఈ రెండు నెలల్లోనే ఇంతటి అనుబంధం ఎలా ఏర్పడింది!

ఇదేనా ప్రేమంటే!

అయితే రవి కూడా ఇటువంటి బాధనే అనుభవిస్తుండాలి!

ఇక్కడకు వచ్చినప్పుడు మాత్రం ఎంత తియ్యని మాటలు చెప్తాడు.

అవన్నీ పై పై మాటలేనా!

మనసులోంచి వచ్చినవి కావా?

ఆలోచనల్తో తల బరువెక్కింది. ఈ రోజు కాలేజీలో పాఠాలు కూడా సరిగ్గా చెప్పలేకపోయింది! రేపూ చెప్పలేదేమో! ఎందుకిలా అవుతోంది!

తన మనస్సు తనకే అర్థం కావటంలేదు.

చీకటి అలుముకుంటోంది!

రవి ఈ రోజు కూడా రాలేదు! రేపూ రాడా! ఇక ఎప్పటికీ రాడేమో! గుండె బరువెక్కింది! ఎందుకో దుఃఖం గుండెల్లోంచి పొంగుకు వస్తోంది.

ఏమిటింత బేల అయిపోతోంది తను! కుర్చీలో కూర్చోలేకపోయింది. లేచి అటూ, ఇటూ తిరగసాగింది.

(ఇంకా ఉంది)

పెద్దకథ

# ప్రేమిస్తే ఏమౌతుంది?



## విన్నకోట సుశీలాదేవి

రవి రావాలి! ఎండిన ఈ నేలపై తొలకరి జల్లు కురవాలి

రవీ! . రవీ!

నేరస్తులని కూడా వారినేరం విచారించి శిక్ష వేస్తారు! కాని మీరు నానేరం ఏమిటో చెప్పకుండానే ఇంత పెద్దశిక్ష వేస్తున్నారు! మీరెంతనిర్దయులు! .. ఒళ్లంతా తీవ్రంగా కంపిస్తోంది! . అక్కడ నిలవలేక లోపలికెళ్లబోయింది.

ఇంతలో గేటు చప్పుడయింది

స్వాతి వెనుదిరిగి చూసింది! . ఎదురుగా రవి వస్తూ కన్పించాడు

గుండెలు ఝల్లుమన్నాయి! మనస్సు చంద్రుడిని చూసిన సముద్రమైంది! ఒక్కసారి పరిగెట్టుకు వెళ్లి అతని గుండెలమీద వాలిపోవాలన్పించింది! రవీ! ప్రేమ పరీక్షలో నెగ్గావు! నీకు నామీద ప్రేమవుంది! అనుకుంది

"స్వాతీ!"

రవి దగ్గరగా వచ్చాడు మెత్తగా, చల్లగా, హాయిగా వుందా పిలుపు

"అలా నిల్చున్నావే!" అన్నాడు రవి స్వాతి చేతిని మెల్లగా స్పృశిస్తూ స్వాతి నిప్పుసోకిన వెన్నయింది

"రవీ" అంటూ అతని చేతులు పుచ్చుకుని కళ్లల్లోకి చూసింది

రవి ఆశ్చర్యపోతూ స్వాతి బుజాలమీద చేతులు వేసి – " ఏమయింది స్వాతీ!" అన్నాడు

"రవీ! ఇక మీరు రారేమో అనుకున్నాను"

"ఛ! అదేంమాట స్వాతీ! రాకుండా వుండగలనా!" అన్నాడు మెల్లిగా

"రవీ! మిమ్మల్ని చూడకుండా ఒక్కక్షణం కూడా వుండలేను! ఈ రెండ్రోజులు ఎంత పిచ్చెక్కిపోయిందో తెలుసా!"

"స్వాతీ!"

"అవును రవీ! నామాటలు విని నవ్వుకుంటున్నారా!"

"నవ్వుకాదు! ఆనందం కలుగుతోంది! నాకింతకన్నా ఏం కావాలి! స్వాతీ! నేను కోరుకున్న స్త్రీ నన్ను ప్రేమించడంకన్నా అదృష్టమేముంది?"

స్వాతిని దగ్గరికి లాక్కుని హృదయానికి హత్తుకున్నాడు ఆమె తలమీద ముఖంఆన్చి "స్వాతీ" అన్నాడు

ఈ రెండు రోజులూ స్వాతి పొందిన ఆవేదన, బాధ ఆ కౌగిలిలో కరిగిపోయాయి.

స్వాతి తలెత్తి, రవి కళ్లల్లోకి చూస్తూ– "రవీ! మిమ్మల్ని చూడందే వుండలేనండీ" అంది.

(గత సంచిక తరువాయి)

"నేనూ అంతే స్వాతీ! వీలైనంత త్వరలో నీమెడలో మూడుముళ్లూ వేసి ఎప్పుడూ ఇలా నీకౌగిల్లో వుండిపోతాను సరేనా!" అన్నాడు

పెళ్లనగానే రాధ జ్ఞాపకం వచ్చింది స్వాతికి రవి చేతులనుండి తప్పించుకుంది

"అదేమిటి అలా అయిపోయావ్! అసలైంది తీసుకోకుండానే వెళ్లిపోతావా!" అంటు చెయ్యి పుచ్చుకున్నాడు

"ఏమిటది?" అంది స్వాతి

"చెప్పనా!" అంటూ ముందుకువంగి ఆమె పెదవులపై

"ఛీ ఏం పని" అంటూ దూరంగా జరిగి కుర్చీలో కూర్చుంది

"ఏం బాగాలేదా!" కొంటెగా అన్నాడు

"ఈ రెండ్రోజులూ రాలేదే!" అంది

"ఆఫీసు పని స్వాతీ! ఈ రోజు కూడా చాలా పనివుంది కానీ పని వదిలేసి ఆఫీసు నుంచి సరాసరి ఇటే వస్తున్నాను ఈ రెండ్రోజులూ నా కోసం ఎదురుచూస్తూ కూర్చున్నావా స్వాతీ!"

రవి అలా అడగ్గానే ఈ రెండ్రోజులూ తను పడ్డబాధ జ్ఞాపకం వచ్చి సిగ్గు కలిగింది స్వాతికి మాట్లాడకుండా తలొంచుకుంది

**జరిగిన కథ–2 :** రెవిన్యూ డిపార్ట్‌మెంటులో తాసిల్దారుగా పనిచేసి రిటైరయిన గోవిందరావుకు, ఆయన భార్యకు ఇద్దరు మగ పిల్లల తర్వాత పుట్టిన స్వాతి అంటే అమితమైన గారాబం స్వాతి ఓ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తూంటుంది ఉమ కోరికమీద ఆమె బర్త్‌డే పార్టీకి వెళ్లిన స్వాతికి అక్కడ రవి పరిచయమౌతాడు. స్వాతి ఇంటికి రవి రాకపోకలు సాగిస్తూంటాడు ఆమెలో అతను చోటు చేసుకొంటుంటాడు రవి మాటల్లో తన మామయ్య కూతురు రాధ విషయం రాగా ఎందుకో అతను తనని మోసం చేస్తున్నాడేమో! అనే అనుమానం చిగురుస్తుంది స్వాతిలో రవి తన మామయ్యకు ఇచ్చిన మాట ప్రకారం అతను రాధనే చేసుకొంటాడని కళ్యాణి ద్వారా తెలుసుకున్న స్వాతి కుమిలిపోతుంది కానీ, తను రాధను ప్రేమించటంలేదనీ స్వాతినే ప్రేమిస్తున్నాననీ, ఆమె ప్రేమ లభించని నాడు తాను బ్రతకననీ అన్న రవి మాటలకు ఆమె మనసు కుదుట పడుతుంది. ఆ తరువాత అతని రాక కోసం ప్రతి రోజూ నిరీక్షిస్తూంటుంది

"నాకు మాత్రం ఆఫీసులో ప్రతి కాగితంలోనూ నువ్వే కన్పించావు! స్వాతీ! ఇలా ఎన్నాళ్లు? నువ్వా కుర్చీలో, నేనీ కుర్చీలో ఇంతేనా! ఇలా చూసుకుంటూ కూర్చుంటే ముసిలాళ్లమైపోతామేమో!"

రవి మాటలకు ఏం సమాధానం చెప్పలేకపోయింది స్వాతి రాధే కనుక లేకపోయినట్లైతే ఈపాటికి అతనిచేత మూడు ముళ్లూ వేయించుకుని హాయిగా కాపరం చేస్తూ వుండేది

"కాలమే మన సమస్యని పరిష్కరించాలి రవీ!"

"స్వాతీ! చాలా అన్యాయింగా మాట్లాడుతున్నావ్ ఇంత ప్రేమ చూపిస్తావు! పెళ్లికి ఎందుకు ఒప్పుకోవు! నీ మనస్సేమిటో నాకర్థం కావడం లేదు!"

"రవీ! ఇందులో అర్థం కాకపోవడానికి ఏముంది! మనం పెళ్లి చేసుకుంటే రాధ ఏమవుతుంది?"

"పోనీ రాధకి మంచి సంబంధం చూసి పెళ్లి చేసి ఆ తర్వాతే మనం చేసుకుందాం సరేనా!"

"సరే" అంది స్వాతి

"అయితే ముందు పెళ్లికొడుకుల వేట ప్రారంభించాలన్నమాట!" కుర్చీలోంచి లేస్తూ అన్నాడు రవి

"నేనూ సహాయం చేస్తాలెండి!"

"థాంక్స్ వస్తాను ఎనిమిదయింది!" అన్నాడు

స్వాతి అతనివేపు కోపంగా చూస్తూ– "ఏడున్నర కొస్తే ఎనిమిదవదూ!" అంది

"ఏం చెయ్యను! రేపు త్వరగా వస్తాలే! ఎక్కువసేపు కూర్చుంటే బాగుండదు! మీ అమ్మగారు ఏమయినా అనుకోరూ! లైసెన్సు వచ్చేస్తే ఎంతసేపయినా కూర్చోవచ్చు!" అంటూ బయటికి నడిచాడు రవి

* * *

ఒకరోజు సాయంత్రం కాలేజీ వదిలాక ఇంటికి బయలుదేరబోతుంటే కళ్యాణి ఆపింది –

"స్వాతీ! కాలేజీ అవగానే అలా పరిగెట్టకపోతే కాస్సేపుండకూడదూ! నేనూ వస్తాను"

స్వాతి మనస్సులో రవి మెదిలాడు! ఈ రోజు రవి వస్తాడు వచ్చి తనకోసం ఎదురు చూస్తూ కూర్చుంటాడేమో? కాని అది కళ్యాణితో ఎలా చెప్పడం?

"ఏమిటే ఆలోచన! పద! పద!" అంటూ బ్యాగ్ సర్దుకుని కళ్యాణి స్వాతితోపాటు బయటికి వచ్చింది

"కళ్యాణీ! మీ అమ్మగారు ఎలా వున్నారు?" స్వాతి అడిగింది

"ఎలా వుంటారు పక్షవాతంలో వున్నవాళ్లు. అది తగ్గదు హెచ్చదు!"

"ఛ! ఏం మాటలవి కళ్యాణీ!"

"ఆవిడ బాధ చూడలేక అలా అన్నాలే!"

"తమ్ముళ్లూ, చెల్లెళ్లూ బావున్నారా?"

"ఏమిటా పరామర్శ? ఎన్నాళ్లకో కనబడ్డ దానిలా!" అంది కళ్యాణి

"ఏం లేదు! తెలుసుకుందామని."

"అంతగా తెలుసుకోవాలని వుంటే మా ఇంటికి రా!"

"ఇప్పుడా?"

అని పిలిచింది కళ్యాణి

స్వాతి మనస్సులో తనకోసం ఎదురు చూస్తూ కూర్చునే రవి మెదిలాడు

"ఆలోచన కట్టిపెట్టి ఇంటికి రా!" అని, రోడ్డుమీద పోతున్న రిక్షాని ఆపి ఎక్కింది కళ్యాణి స్వాతి కూడా తప్పనిసరిగా ఎక్కి కళ్యాణి ప్రక్కన కూర్చుంది.

"ఇదివరకు రోజూ సినిమాకో, బజారుకో, షికారుకో వెళ్లేవాళ్లం మనిద్దరం కలిసి సినిమాకి వెళ్లి మూడు నెలలయింది తెలుసా!" అంది కళ్యాణి.

అవును! రవితో పరిచయమై రేపటికి మూడు నెలలు. చక్కగా జ్ఞాపకం చేసింది తన పరిచయానికి గుర్తుగా రవికి ఏదైనా ప్రెజెంట్ చెయ్యాలి! అనుకుంది స్వాతి

"నాతో మాట్లాడదలచుకోలేదా?"

"అబ్బే! అదేం లేదు కానీ, ఇంకెవరైనా వస్తున్నారా?" అనడిగింది స్వాతి

"ఊహు! నువ్వొక్కదానివే!"

"కళ్యాణి! నీ పుట్టినరోజని కాస్త ముందుగా చెప్పకూడదూ! పోనీ పొద్దున్నైనా చెప్పాల్సింది!"

"అసలు నీకు మనుషులు కన్పిస్తున్నారా! నన్ను చూస్తే నేను చెప్పకుండానే తెలిసేది"

అప్పుడు చూసింది పరీక్షగా స్వాతి. కళ్యాణి తలంటు పోసుకుంది. గ్రీన్ బోర్డరున్న కాశ్మీరు సిల్కుచీర కట్టుకుంది

నిజంగా ఇవ్వాళ కొత్తగా వుంది కళ్యాణి.

"ఏమయింది మీ ప్రేమ వ్యవహారం?" అనడిగింది కళ్యాణి

"ఏమీ కాలేదు!" అంది స్వాతి సంభాషణ తుంచేస్తూ

"కానీ స్వాతీ! నువ్వు ప్రేమలో పడ్డావంటే చాలా ఆశ్చర్యంగా వుంది ఎంతో సీరియస్‌గా వుంటావ్! నీ దగ్గరికొచ్చే ధైర్యం అసలు ఏ మగాడికైనా వుందా!"

అవును ఎవ్వరికీ ధైర్యం లేదు! ఆడపిల్లని ఎలా ఆకర్షించాలో ఈ లోకంలో ఎంతమందికి తెలుసు?

రిక్షా కళ్యాణి ఇంటిముందు ఆగింది

ఇద్దరూ రిక్షా దిగారు మెట్లెక్కి లోపలి కెళ్లారు.

"కూర్చో స్వాతీ!" అని కళ్యాణి లోపలకు వెళ్లబోయింది. ఇంతలో బయటినుంచి—"కళ్యాణీ!" అన్న పిలుపు విన్పించింది. కళ్యాణి గుమ్మంలోంచి బయటికి తొంగి చూసి — "ఓ! నువ్వా మోహన్! రా! రా! నీ కోసమే ఎదురుచూస్తున్నా!" అంటూ ఆహ్వానించింది

చూసింది ఎర్రగా, సన్నగా వున్నాడు కళ్యాణి ఇద్దర్నీ పరస్పర పరిచయం చేసింది

"కూర్చో మోహన్!" అని లోపలకు వెళ్లింది కళ్యాణి

స్వాతి కిటికీలోనుండి బయటికి చూస్తోంది. మోహన్ గోడమీద వున్న క్యాలెండర్లను చూస్తున్నాడు. కళ్యాణి రెండు ప్లేట్లలో టిఫిను తెచ్చింది.

బద్ధ శత్రువుల్లా కూర్చున్న వారిద్దరిని చూసి నవ్వుతూ —

"అదేమిటి? ఇద్దరూ పోట్లాడుకున్నారా!" అంటూ ఇద్దరికీ చెరో ప్లేటు ఇచ్చింది

తనూ ఒక కుర్చీ లాక్కొని కూర్చుని — "ఎలా వున్నాడు? మీ బాస్!" అనడిగింది మోహన్ని.

"అలాగే వున్నాడు!"

"స్వాతీ! వీళ్ల బాస్‌తో ఎవడో మూడునెల్లో చస్తావని చెప్పాట్ట! అప్పటినుంచీ ఆయన బెంగ పెట్టుకుని చిక్కి శల్యమౌతున్నాడు. వాడి జోస్యం ఏమోగానీ ముందు ఈ బెంగతోనే చచ్చేట్టున్నాడు!" అంది స్వాతితో.

"తొందరగా చస్తే పీడా వదులుతుంది!" అన్నాడు మోహన్.

"నీకేం! నువ్వంటే మీ బాస్‌కి ఇష్టమేగా!"

ఇంతలో లోపలినుండి కళ్యాణిని పిలవడంతో లేచి వెళ్లింది కళ్యాణి



# ఉత్తమ-అధమ పరీక్ష

మానవులలో అధముడైనవాడు గర్వించి తానే ఉత్తముడనని అనుకుంటాడు ఉత్తముడు వినయంతో తానే అందరి కంటె అధముడనని భావిస్తాడు ఇది లోక సహజం దీనికి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా తమ ప్రసంగంలో చెప్పిన చిన్నకథ ఆధారంగా ఒక ఉదాహరణను చూపుతున్నాను

శ్రీ కృష్ణునికి దుర్యోధనుని స్వభావాన్నీ, ధర్మరాజు స్వభావాన్నీ పరీక్షించాలని బుద్ధి పుట్టింది అతడు దుర్యోధనుడితో — లోకంలో ఏ లోపంలేని ఉత్తముడెవడన్నా ఉంటే తెలపవలసిందని కొన్నాళ్ళ గడువిచ్చాడు అలాగే యుధిష్ఠిరుణ్ణి చూచి "లోకంలో ఏ మంచితనంలేని అధముణ్ణి తెలుపగోరాడు" అతనికిన్నీ కొంతకాలం గడువు ఇచ్చాడు. అధమం ఒకడైనా అలాంటివాడు ఉంటాడని, అతణ్ణి కనుక్కొని తనకు చెప్పాలని భగవానుడు వారిద్దరినీ గట్టిగా కోరాడు

కొన్నిరోజులు గడిచాయి దుర్యోధనుడు దేశమంతా తిరిగాడు ఉత్తముడని పేరు పడిన ప్రతి వ్యక్తినీ నిశితంగా పరీక్షించాడు ఒక వ్యక్తి కూడా అత్యుత్తముడుగా కానరాలేదు అట్టి ఉత్తములలో ఏవో లోపాలు కానవస్తూనే ఉన్నవి కనీసం ఒక లోపమన్నా కనబడేది

## - ధర్మపథం -

అందువల్ల అతడు కృష్ణుని వద్దకు తిరిగివచ్చి తనకట్టివాడు ఎవ్వడూ కనబడలేదనీ, తాను (దుర్యోధనుడు) తప్ప అట్టి ఉత్తముడు మరియొకడు ఉన్నట్లు తోచదనీ చెప్పాడు తానే సర్వోత్తముడనే అహంకారం గల అతణ్ణి చూచి భగవానుడు లోలోపలే నవ్వుకున్నాడు.

తర్వాత ధర్మరాజు కూడా తిరిగివచ్చాడు "నేను చాలా చోట్ల తిరిగివచ్చాను అధములని,చెడ్డవారని చెప్పకునే అందరినీ పరిశీలించాను వారిలో ఏవో కొన్ని మంచిగుణాలు కూడా కానవచ్చాయి నీవు కోరినవ్యక్తి నాకెక్కడా కనబడలేదు ఆలోచించి చూస్తే నేనే అట్టి వ్యక్తినని తోచింది ఆ వ్యక్తిని నీ ముందు నిలబెడుతున్నాను" అని సవినయంగా తెలియజేశాడు.

ఆ మాటలకు భగవానునికి ఎంతో ఆనందం కలిగింది అతడు ధర్మరాజును కౌగిలించుకొని, అతని స్వభావాన్ని మిక్కిలి ప్రశంసించాడు

"నా యీ పరీక్షవల్ల అసలు రంగు బయటపడింది" అని శ్రీ కృష్ణుడు మనస్సులో అనుకున్నాడు

—బులుసు వేంకటరమణయ్య

# ప్రేమిస్తే ఏమౌతుంది?

స్వాతి అక్కడ వున్నదన్నమాటేగానీ మనసంతా రవిమీదే వుంది

రవి వచ్చి వుంటాడు! తనకోసం ఎదురు చూస్తూ వుంటాడేమో! తను ఇంకా రాలేదని బాధపడతాడేమో! చూసి, చూసి విసుగుపుట్టి వెళ్ళిపోతాడేమో

ఆక్షణాన ఇంటిముందు వాలాలన్పించింది స్వాతికి

"స్వాతీ! ప్లేటులో చెయ్యిపెట్టుకుని అలా కూర్చున్నావే!" కళ్యాణి అడిగింది

"ఏంలేదే! తినాలన్పించడంలేదే!"

కళ్యాణి నవ్వింది

"స్వాతీ! నీ బాధ నాకుతెలుసు! ముందీ కాఫీ తాగివెళ్ళు!" అంటు కప్పు అందించింది

స్వాతి కాఫీ తాగుతోంది

కళ్యాణి మోహన్ తనకు బర్త్‌డే ప్రెజెంట్‌గా ఇస్తానన్న వుంగరాన్ని గూర్చి ఆలోచిస్తోంది.

స్వాతి కాఫీతాగడం ముగించి, తన బ్యాగ్ తీసుకుని లేచినిలబడి బర్త్‌డే విషెస్ చెప్పింది

"వస్తా కళ్యాణీ! వస్తానండీ మోహన్‌గారూ!" అని బయటకొచ్చి రిక్షా ఎక్కింది స్వాతి

* * *

స్వాతి ఇంటికొచ్చేసరికి రవి తండ్రితో మాట్లాడుతున్నాడు

అతడిని చూసి "అమ్మయ్య వెళ్ళిపోలేదు!" అనుకుని గబగబా లోపలికొచ్చింది.

"ఇవ్వాళ ఆలస్యం అయిందేమ్మా!" అనడిగాడు తండ్రి

"కళ్యాణి బర్త్‌డే! పార్టీకి పిలిస్తే వెళ్ళాను!" అని రవి వైపు చూస్తూ — "మీరొచ్చి చాలా సేపయిందా!" అనడిగింది

"ఒక అరగంటవుతుంది! అయినా ఇన్నాళ్ళకి మీ నాన్నగారితో మాట్లాడే అవకాశం లభించింది!" అన్నాడు రవి.

"మీకు కాఫీ తెస్తాను!" అని లోపలికెళ్ళి కాఫీతెచ్చి రవికిచ్చింది! రవి దాన్ని అందుకుంటూ గోవిందరావు వేపుచూచి - "మీరూ" అన్నాడు

"నేను తాగాను! మీరు తీసుకోండి"

స్వాతి ప్రక్కకుర్చీలో కూర్చుంది

"రిటైరయిన తర్వాత జీవితం చాలా డల్‌గా వున్నదండీ!" అన్నారాయన

"రోజూ నేనువచ్చి మీకు కంపెనీ ఇస్తానండీ" అన్నాడు రవి స్వాతివైపే దొంగచూపులు చూస్తూ.

"అలాగే! అంతకంటేనా! ఇవ్వాళ వివేకానంద మందిరంలో లెక్చర్ వుంది వెడతాను" అని లేచాడాయన. స్వాతిలేచి గదిలోకెళ్ళింది

రవి కూడా లేచాడు.

ఆయన గేటు దాటాక గదిలోకొచ్చాడు స్వాతి తలొంచుకుని మేగజైన్ ఏదో చదువుకుంటోంది

"తమరలా పుస్తకంచదువుకోడంలో వుద్దేశం? నన్ను వెళ్ళిపొమ్మనా! కోపమా?" అన్నాడు రవి

"కోపమా! నాకెందుకు? అయినా మీమీద కోపం తెచ్చుకోడానికి నేనెవర్ని" అంది మూతి బిగిస్తూ.

"ఎవరివో చెప్పనా! ఈ హృదయానికి రాణివి! వీడిచేత పూజలందుకునే దేవతవి!" అన్నాడు తనని వేలెట్టి చూపుకుంటూ.

"ఉ! మాటల చమత్కారానికేం! బాగానే వుంది" అంది మూతి విరుస్తూ.

"మాటలేకాదు, చేతల్లోకూడ చమత్కారం వుంది చూపనా!" అన్నాడు స్వాతి చెయ్యిపట్టుకుని వూపుతూ

స్వాతి రవి చేయి తీసేస్తూ —

"ఇది ఇల్లు! లోపల అమ్మవుంది! తమరు హద్దుల్లో వుండాలి! అలా కూర్చోండి బుద్ధిగా" అంది

"చిత్తం! దేవిగారి ఆజ్ఞ!" అన్నాడు చేతులు కట్టుకుని తలవంచుతూ!

అతని అభినయానికి స్వాతి ఫక్కున నవ్వింది.

"అమ్మయ్య! ఇప్పటికి ముత్యాలు రాలాయి! కోపం పోయినట్లేనా!"

స్వాతి అతని కళ్ళల్లోకి చూస్తూ — "రవీ! కోపం కాదు బాధ మీరు ఒక్కరోజు రాకపోతే ఎంత పిచ్చెక్కిపోతుందో తెలుసా! రవీ! మిమ్మల్ని చూడకుండా ఒక్కక్షణం కూడా వుండలేను! దయచేసి రోజూ రండి!"

స్వాతి అభ్యర్థనకు కరిగిపోయాడు స్వాతి చేతిని తన చేతిలోకి తీసుకుని — "ఒక్కొక్కసారి అన్పిస్తూవుంటుంది ఈ వుద్యోగానికి రిజైను చేసి నిన్ను తీసుకుని ఏ కాశ్మీరో, సిమ్లాకో వెళ్ళిపోవాలని" అన్నాడు

"వెళ్ళిపోదాం రవీ! అక్కడో చిన్న కుటీరం వేసుకుందాం! ఇంటి ముందు చక్కటి పూలతోట కూడ వేసుకుందాం, చెట్లకి కాసే కాయలుతింటూ, సరస్సుల్లోని నీళ్ళతాగుతూ ఎదురెదురుగా కూర్చుని రోజుల్లా కబుర్లు చెప్పుకుంటూ వుంటే ఎంత బాగుంటుందో కదా! జీవితంలో అంతకంటె ఏం కావాలి?"

స్వాతి తన్మయత్వంతో అంటోంది

"స్వాతీ!" అంటూ ఆమెవేపు ప్రేమగా చూస్తూ — "జీవితంలోని మాధుర్యం, ప్రేమలోని

తియ్యదనం నిన్ను చూశాకే అనుభవంలోకి వచ్చాయి'' అన్నాడు

రవి చేతిని చెంపకు ఆన్చుకుంది అలా ఎంతసేపు కూర్చున్నారో! హఠాత్తుగా రవి లేచి—'వస్తాను స్వాతీ!'' అన్నాడు తన చేతిని తీసుకుంటూ

స్వాతి రవి చేతిని గట్టిగా పట్టుకుని—''ఊహు! వద్దు!'' అంది

''లేదు! వెడతాను. బాగుండదు మీ నాన్నగారు వచ్చే టయిమయింది!''

రవి కనుమరుగయ్యేవరకూ చూస్తూ నిలబడి ఆ తర్వాత వెనుదిరిగింది స్వాతి!

* * *

''రాధా! అలా కూర్చున్నావేం తల్లీ!''

రాధ కిటికీలోనుండి బయటికి చూస్తూ కుర్చీలో కూర్చుంది శారదమ్మ మాటకు రాధ వులిక్కిపడి తల తిప్పి చూసింది

ఎప్పుడూ వుషారుగా, నవ్వుతూ తిరిగే రాధ ముఖంలో దిగులు, విచారం కనబడింది ఆవిడకి

రాధకు దగ్గరగా వచ్చి—

''రాధా! నువ్వీ మధ్య చాలా దిగులుగా వుంటున్నావు! ఎందుకలా వుంటున్నావు! ఒంట్లో బాగుండటం లేదా?'' అంటూ ప్రశ్నించింది ఆవిడ.

''బాగానే వుందత్తయ్యా!''

''మరెందుకమ్మా! అలా వున్నావ్! చెప్పక పోతే ఎలా తెలుస్తుంది! చెప్పు తల్లీ!'' అత్తయ్య ప్రేమలో కరిగిపోయింది రాధ

''అత్తయ్యా! బావ అస్సలు నాతో మాట్లాడ్డమే లేదు'' అంది దిగులుగా. శారదమ్మ ఆ మాటకి నవ్వేస్తూ—

''ఓస్ అదా నీ బాధ! వాడికి ఏవో ఆఫీసు పన్లు వుండి వుంటాయ్! తీరుబడిలేక మాట్లాడి వుండడు''

''తీరుబడిలేక కాదత్తయ్యా! ఇదివరక్కన్నా ఇప్పుడు ఏమంత పని పెరిగిందని! నీకు తెలీదు. బావలో ఏదో మార్పు వస్తోంది!''

''మార్పా! నీ మొహం అదేం లేదు!'' అంటూ రాధ మాటని కొట్టిపారేసింది ఆవిడ.

''లేదత్తయ్యా! అదుగో బావ వస్తున్నాడు కావలిస్తే బావనే అడుగు'' అని రాధ కుర్చీలోంచి లేచింది.

రవి లోపలికొచ్చాడు.

''రవీ! రాధ నీ మీద ఏదో ఫిర్యాదు చేస్తోందిరా!'' అంది శారదమ్మ నవ్వుతూ.

రవి కుర్చీ లాక్కుని కూర్చున్నాడు

''ఏమిటమ్మా అది!''

''నువ్వు తనతో మాట్లాడ్డం లేదుట! నీలో చాలా మార్పు వచ్చిందిట.''

రవి రాధ వేపు చూస్తూ—''అవునా! రాధా!'' అన్నాడు

రాధ తలొంచుకుంది

''ఒరేయ్! నేనీ ఫిర్యాదులు వినలేనురా! అయినా ఈ ఫిర్యాదుల వెనక వున్న రాధ మనసులోని భావం గ్రహించావా?'' అంది ఆవిడ నవ్వుతూ

# ప్రేమిస్తే ఏమౌతుంది?

''లేదమ్మా.''

''తొందరలో పెళ్లి చెయ్యి అత్తయ్యా! అని అంతేనా రాధా!''

''ఫో! అత్తయ్యా!'' అంటూ రాధ లోపలికి పరిగెట్టింది.

''పిచ్చిపిల్ల! రవీ! రేపొకసారి శాస్త్రులుగారిని 'రమ్మని చెప్పు'' అంది

రవి తెల్లబోతూ—

''ఎందుకమ్మా?''

''మీ పెళ్లికి ముహూర్తం పెట్టిస్తాను'' అంది ఆవిడ

రవి కంగారు పడిపోయాడు

''అమ్మా! ఇప్పుడు పెళ్లికి తొందరేముంది?''

''ఇంకానయంరా! ఎన్నాళ్లని! ఇప్పటికే ఆలస్యమైంది వీలైనంత త్వరలో ఈ పెళ్లి జరిగి పోవాలి ఏమంటావ్?''

## మీ టిం గ్

'ఆకాశంలో నక్షత్రాల కాన్ఫరెన్స్
అధ్యక్షత వహించాల్సిన
చంద్రుణ్ని
మేఘాలు కప్పేసిన వైనం'—
తెల్లారి
పేపర్లో చదివిన సూర్యుడు
సన్నగా నవ్వుకున్నాడు.
వీళ్ల తపనంతా
వెలుగులోకి
రావాలనే కదా!!!

— రా మ మూ ర్తి

రవి ఎటూ చెప్పలేకపోతున్నాడు కాని ఇప్పుడు చెప్పకపోతే ఆ తర్వాత చెప్పడానికి అవకాశం కూడా వుండదు.

''అమ్మా! నేను రాధని చేసుకోలేనమ్మా!''

ఆ మాటకి శారదమ్మ ఆశ్చర్యపోయింది.

''అదేమిట్రా!''

''అవునమ్మా! నేను స్వాతిని చేసుకోవాలను కుంటున్నాను'' అన్నాడు.

''స్వాతి ఎవరు?''

''అదేనమ్మా! ఆ రోజు మనింటికి రాలేదూ! ఆ అమ్మాయి''

''రవీ! నీకేమన్నా మతిపోయిందా! చిన్నప్ప ట్నించీ అనుకున్న రాధని కాదని ఆ పిల్లనెవర్నో చేసుకుంటావా?''

''అమ్మా! నేను రాధని చేసుకోలేనమ్మా! స్వాతిని ప్రేమించాను! ఆ అమ్మాయినే నేను కుంటాను. నన్నర్థం చేసుకోమ్మా!''

రవి అలా అడగ్గానే శారదమ్మకి ఏం అనాలో తోచలేదు క్షణం ఆగి అంది—

''రవీ! రాధకి నువ్వంటే ప్రాణంరా! పైగా రాధని కోడలుగా చేసుకుంటానని అన్నయ్యకు మాట ఇచ్చాను నువ్వు ప్రమాణం కూడా చేశావు అదీకాక రాధకి ఎలా చెప్పాలి? నువ్వుమాట్లాడ్డం లేదనే బెంగపెట్టుకుంది నువ్వు కాదన్నావని తెలిస్తే అదేమవుతుంది!''

''తెలుసమ్మా! కానీ ఏం చేయను? రాధను చేసుకోలేను!''

''రవీ! నువ్వంటే ప్రాణంవిడిచే రాధని చేసుకుంటే నీజీవితం హాయిగా వుంటుంది! రాధ చాలా మంచిపిల్లరా! నువ్వు రాధని కాదని వేరెవర్నో చేసుకోవడం నాకిష్టంలేదు! నువ్వూ చదువుకున్న వాడివి ఆలోచించు! ఒక ఆడపిల్లని వుసురు పెట్టడం అంత మంచిది కాదురా!''

''అదికాదమ్మా! పోనీ రాధకి మంచిసంబంధం చూసి పెళ్లిచేసి ఆ తర్వాతే మేము చేసుకుంటాం సరేనా!''

''ఏమోరా! నీఇష్టం!'' అంటూ ఆవిడ అన్యమనస్కంగా అక్కడనుంచి లేచి వెళ్లింది.

రవి అలాగే కూర్చున్నాడు! ఎన్ని అడ్డంకులు వచ్చినాసరే స్వాతిని వదులుకోలేడు! ముందు రాధకి పెళ్లి చెయ్యాలి! రేఃటినుండి ఆ ప్రయత్నంలో తిరగాలి! అనుకున్నాడు రవి

''హలో మోహన్!''

ఫాన్సీస్టోర్‌లో ఏదో కొంటున్న మోహన్ వెనుదిరిగాడు! కళ్యాణి నవ్వుతూ కన్పించింది! మోహన్ ముఖం విప్పారింది.

''కళ్యాణి! చాలా రోజులకి కన్పించావ్!'' అన్నాడు సంతోషంగా.

''అయిందా నువ్వు కొనడం!'' అనడిగింది కళ్యాణి.

''ఆ! నువ్వూ!''

''నేనేం కొనక్కర్లేదు! బయట నీ స్కూటర్ చూసి లోపలికొచ్చాను''

మోహన్ ప్యాకెట్ తీసుకుని డబ్బులిచ్చేసి బయటకొచ్చాడు.

కళ్యాణి అనచీర ప్యాకెట్ స్కూటర్‌కి తగిలించిన బాస్కెట్‌లో వేసింది.

''మోహన్! ఆకలి దంచేస్తోంది! ముందు ఏదైనా హోటల్‌కి తీసికెళ్ళు!''

''అలాగే! ఎక్కు'' అని స్కూటర్ స్టార్టు చేశాడు.

కళ్యాణి వెనక ఎక్కింది.

క్షణంలో హోటల్ ముందు ఆపాడు స్కూటర్ని.

ఇద్దరూ ఫామిలీ రూములో కూర్చున్నారు!

''ఆ! ఇప్పుడు చెప్పు! ఇన్నాళ్లూ తమరు ఎక్కడికెళ్లారు!'' అనడిగింది కళ్యాణి.

''ఫ్రెండ్ మేరేజ్ అయితే వెళ్లాను''

''పోనీ వెళ్లేటప్పుడు కాస్త చెప్పకూడదూ!''

''చెప్పాలనే అనుకున్నాను. కాని అర్జంటుగా వెళ్లాల్సి వచ్చింది కళ్యాణీ!'' అన్నాడు మోహన్

(ఇంకా ఉంది)



పెద్దకథ

# ప్రేమిస్తే ఏమౌతుంది?

వినుకోట సుశీలాదేవి

(గత సంచిక తరువాయి)

ఇంతలో సర్వర్ వచ్చాడు! కళ్యాణి టిఫిను ఆర్డరు చెప్పింది. సర్వర్ వెళ్లాడు.

"మోహన్! అర్జంటుగా వంద రూపాయలు కావాలి, వున్నాయా!" అనడిగింది కళ్యాణి.

"ఎందుకూ!" అంటూ మోహన్ నిట్టూర్చాడు.

ఇప్పటికే కళ్యాణికి చాలా ఇచ్చాడు! తమా ఒక సామాన్య వుద్యోగస్తుడే! ఎప్పటికప్పుడు కళ్యాణితో తన విషయం చెప్పాలనుకుంటాడు! కాని చెప్పలేకపోతున్నాడు.

కళ్యాణికి డబ్బుమీదవున్న వ్యామోహం తనకు తెలుసు! తను డబ్బులేని వాడినని తెలిస్తే తనకు దూరమౌతుందేమోనని భయం! కాని చెప్పకుండా ఎన్నాళ్లిలా?

"ఏం లేవా! మోహన్!"

"వుంది ఇస్తాను" అన్నాడు.

కళ్యాణి తేలిగ్గా వూపిరి పీల్చుకుంది. సర్వర్ టిఫిను తెచ్చాడు.

కళ్యాణి ఒకప్లేటు తనముందు లాక్కుని తినసాగింది.

"కళ్యాణీ! నీతో ఒక విషయం మాటాడాలి!" అన్నాడు మోహన్.

కళ్యాణి ఆశ్చర్యంగా చూసింది!

"మాట్లాడు మోహన్!"

"ఇక్కడకాదు! ఏదైనా ప్రశాంతమైన ప్రదేశానికి వెడదాం!"

"ఓయెస్! దానికేం? అలాగే"

"రేపు చెప్తాను ఎక్కడికి వెళ్లాలో!" కాఫీ టిఫిను ముగించి బయటకి వచ్చారు.

కళ్యాణి టైము చూసింది. తొమ్మిదయింది.

"సెంకెడ్‌షోకి వెడదామా మోహన్!"

"ఉహూ! నేను రాలేను కళ్యాణీ! కొద్దిగా పనుంది!" అన్నాడు.

కళ్యాణికి నిరాశ కలిగింది! "సరే! అయితే నన్ను ఇంటిదగ్గర దింపెయ్!" అంది స్కూటర్ ఎక్కుతూ.

మోహన్ కళ్యాణిని ఇంటిదగ్గర దింపాడు. కళ్యాణి ఇంట్లోకి వెడుతూ — "రేపు కన్పిస్తావా!" అంది.

"ఆ!" అన్నాడు మోహన్.

కళ్యాణి ఇంట్లోకి వెళ్లి పోయింది!

బట్టలు మార్చుకుంటూ అనుకుంది!— మోహనేదో ముఖ్యవిషయం మాట్లాడాలన్నాడు! ఏమిటో అది? అయినా మోహన్ ఒట్టి సెంటిమెంటల్ ఫూల్! ఎక్కడికీరాడు. నీతులు, నియమాలు అని మడికట్టుక్కూర్చుంటే మనిషి ఏం సుఖపడతాడు? మోహన్ తనకు ఈ నెలలో గొలుసు చేయిస్తానన్నాడు! ఈ మాటు కన్పించినపుడు గుర్తు చెయ్యాలి! అనుకుంది.

చెల్లెలు భోజనానికి పిలవడంతో లోపలకు వెళ్లింది కళ్యాణి.

"స్వాతి!"

స్వాతి తలెత్తి రవి వేపు చూసింది

"రేపు కృష్ణా బ్యారేజ్‌కి వెడదామా?" అన్నాడు

"ఎందుకూ?" అంది స్వాతి

"ఎందుకేమిటి? ఎప్పుడూ ఈ నాలుగ్గోడల మధ్య కూర్చోడమేనా? కాస్త మనస్సు విప్పి మాట్లాడుకుందాం!"

"రోజూ మాట్లాడుకుంటూనే వున్నాంగా!"

"ఏం మాట్లాడుకుంటున్నాం! నా మొహం! ఏ మాట మాట్లాడాలన్నా ఎవరన్నా వింటారేమోనని భయం!"

"మరయితే అక్కడ వుండరా, మనుషులు?"

"ఉంటారు కానీ వాళ్లు మనల్ని గూర్చి పట్టించుకోరు! అటువంటి చక్కటి ప్రదేశంలో కూర్చుని నీ కళ్లల్లోకి చూస్తుంటే ఎన్ని కబుర్లు వస్తాయనుకున్నావ్?" స్వాతి కళ్లల్లోకి కొంటెగా చూస్తూ అన్నాడు.

**జరిగిన కథ–3 :** రెవిన్యూ డిపార్ట్‌మెంటులో తాసిల్దారుగా పనిచేసి రిటైరయిన గోవిందరావుకు, ఆయన భార్యకు ఇద్దరు మగపిల్లల తర్వాత పుట్టిన స్వాతి అంటే అమితమైన గారాబం. స్వాతి కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తూంటుంది ఉమ కోరికమీద ఆమె బర్త్‌డే పార్టీకి వెళ్లిన స్వాతికి అక్కడ రవి పరిచయమౌతాడు స్వాతి ఇంటికి రవి రాకపోకలు సాగిస్తుంటాడు. ఆమెతో అతను చేటు చేసుకొంటుంటాడు రవి మాటల్లో తన మావయ్య కూతురు రాధ విషయం రాగా ఎందుకో అతను తనని మోసం చేస్తున్నాడేమో! అనే అనుమానం చిగురుస్తుంది స్వాతిలో రవి తన మామయ్యకు ఇచ్చిన మాట ప్రకారం అతను రాధనే చేసుకొంటాడని కళ్యాణి ద్వారా తెలుసుకున్న స్వాతి కుమిలిపోతుంది. కానీ, తను రాధను ప్రేమించటంలేదనీ స్వాతినే ప్రేమిస్తున్నాననీ, ఆమె ప్రేమ లభించని నాడు తాను బ్రతకననీ అన్న రవి మాటలకు ఆమె మనసు కుదుట పడుతుంది. ఆ తరువాత అతని రాక కోసం ప్రతి రోజూ నిరీక్షిస్తూంటుంది స్వాతి కొలీగ్ కళ్యాణి మోహన్‌మీద ప్రేమకన్నా అతని డబ్బుమీదా, అతను చేయించే వస్తువులమీద వ్యామోహం ఎక్కువ చూపుతుంటుంది తన పరిస్థితిని ఎలాగైనా ఆమెకు చెప్పాలని నిశ్చయించుకుంటాడు మోహన్.

స్వాతి చిన్నగా నవ్వుతూ— "ఏమిటో ఆ కబుర్లు?" అంది

"మచ్చుకొకటి చెప్పనా?"

"ఊఁ!"

"చల్లని వెన్నెలరోజున, మల్లెలు పరిచిన బెడ్‌మీద తెల్లచీర కట్టుకుని నువ్వు పడుకుంటే, నీలోని అందాల్ని నేను చూస్తుంటే అంతకంటె స్వర్గం ఎక్కడుంటుందంటాను!"

స్వాతి ముఖం చిట్లించింది.

"ఛ! ఏం మాటలవి?"

"ఏం బాగాలేదా! అయినా సౌందర్యాన్ని గూర్చి నీకేం తెలుసు? స్వాతీ! నీ అణువణువులోని సౌందర్యం దర్శించి తరించాలి!"

స్వాతికోపంగా "మళ్లీ అవే మాటలా?" అంది.

"తప్పేం వుంది స్వాతీ! ప్రతి మనిషిలోనూ కొద్దో, గొప్పో సౌందర్యారాధన వుంటుంది! సృష్టిలోని సౌందర్యానికి పరాకాష్ఠ స్త్రీ! అందమైన స్త్రీ సౌందర్యాన్ని తనివితీరా చూడటం కన్నా సౌందర్యోపాసకుడు కోరుకునేదేముంది? కళారాధకులు ఆరాధించేది ఆ సౌందర్యాన్నే కదా!"

అలా ఉద్వేగంగా చెప్తున్న రవికి ఏం సమాధానం చెప్పాలో తోచలేదు స్వాతికి

"స్వాతీ! నా కోర్కె తీర్చవూ?"

రవి కంఠంలోని ఆర్ద్రతకు చలించిపోయింది స్వాతి

"తీరుస్తాను రవీ! మీ కోసం ఏదైనా చేస్తాను! మీరడిగిన దేదీ కాదనలేదు మీ ఈ స్వాతి!" అంది.

"స్వాతీ!" లేచి స్వాతి దగ్గరికి రాబోయాడు రవి

"ఆగండి దొరగారూ! ఇది ఇల్లు!" స్వాతి వారించింది

రవి నిరాశగా మళ్లీ కుర్చీలో కూర్చుంటూ— "నీతో వచ్చిన చిక్కే ఇది!" అన్నాడు

"అవునండీ! దానికి సమయం రావాలి! అంత వరకూ మనకీ విరహం తప్పదు!"

"సరేకానీ ముందు బ్యారేజ్‌కి వస్తావా? రావా?" అనడిగాడు సూటిగా

"ఉహూ! రాను" తలతిప్పింది స్వాతి.

"రావా!"

"ఉహూ!"

"సరే! నీ ఇష్టం" అని వూరుకున్నాడు.

స్వాతి అతనివేపు చూసి నవ్వుతూ—"దొరగారికి కోపం వచ్చినట్టుందే!" అంది

రవి మాట్లాడకుండా సీరియస్‌గా కూర్చున్నాడు

''నిజంగా అదంతా కోపమేనా! చూస్తున్నాగా! నాకు కోపం అంటారు కానీ, అసలు మీకు ముక్కు మీద వుంటుంది కోపం. రవీ! ఆడపిల్లలకు కాస్త బెట్టు వుంటుంది. మీరు కనుక బ్రతిమిలాడారంటే ఆ బెట్టు సడలిపోతుంది. ఇది ఆడవాళ్ల స్వభావం! ఆ మాత్రం తెలీదా ?''

రవి ముఖం ప్రసన్నమైంది.

''ఓ! ఆది బెట్టా! బ్రతిమాలాలంటే ఎన్నిసార్లైనా బతిమాలుతాను! కావాలంటే కాళ్లమీద కూడా పడతాను'' అన్నాడు.

''అయితే బ్రతిమిలాడండి'' అంది స్వాతి నవ్వుతూ.

రవి గొంతు సవరించుకున్నాడు.

''స్వాతీ! నా బంగారు స్వాతీ! నువ్వు రాకపోతే నేను బ్రతకలేను! నేను ఏ పనీ చెయ్యలేను! పని అంటే ఆఫీసు పని అన్నమాట! నేను ...'' అన్నాడు చేత్తో అభినయిస్తూ.

స్వాతి నవ్వింది.

''ఏం బాగాలేదు! ఏదో తెచ్చిపెట్టుకున్నట్లుంది, కానీ సహజంగా లేదు!'' అంది.

''సరే! రాత్రికి బాగా ప్రాక్టీసు చేసి రేపు చెప్తాను. రేపు ఎంత బాగా చెప్తానో నువ్వే చూస్తావుగా.''

''సరే'' అంది స్వాతి.

క్షణంసేపు మౌనంగా వున్నారు.

''రవీ! ఇవ్వాళ మా ప్రిన్సిపాల్ నన్ను పిలిచి చివాట్లు వేసింది,'' అంది స్వాతి.

''ఎందుకూ ?''

''పోర్షను పూర్తికాలేదని !''

''ఎందుకని కాలేదు ?''

''ఎందుకు కాలేదో మీకు తెలీదా! పుస్తకం తెరిస్తే చాలు మీరే కన్పిస్తున్నారు. ఇంకెలా పాఠాలు చెప్పను!'' అంది విచారంగా.

రవి నవ్వేస్తూ —

''ఓ అదా విషయం! పోనీ ప్రేమ పాఠాలు చెప్పు. పిల్లలకి కూడా ముందు ముందు వుపయోగంగా వుంటుంది'' అన్నాడు.

''పిల్లల సంగతి ఏమోగానీ, ముందు నన్ను డిస్మిస్ చేస్తారు.''

''చెయ్యనీ, హాయిగా వచ్చి నా కౌగిల్లో వాలిపో! ఇద్దరం పక్షుల్లా ఎగిరిపోదాం!'' అని టైము చూసుకున్నాడు.

''అబ్బ! అప్పుడే ఏడయిందే! నీతో మాట్లాడుతూ కూర్చుంటే టైమే తెలీదు.''

''ఇంకాస్సేపు కూర్చోండి.''

''వద్దు స్వాతీ! మీ ఫాదర్ వాకింగ్ నుంచి వచ్చేస్తారు. ఇంతసేపున్నాడు ఈ దుర్మార్గుడు! మా అమ్మాయికి ఏం నూరిపోస్తున్నాడో అనుకుంటారు.''

''సరే! వెళ్లండి'' అంది నెమ్మదిగా.

''అప్పుడేనా!'' అంటూ స్వాతి ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని ముక్కుమీద ముద్దు పెట్టుకుని ''సంపెంగ పువ్వువంటి ముక్కు అంటారు. బహుశ నీ ముక్కుని చూసే ఆ వర్ణన వచ్చి వుంటుంది.'' అని — పెదవుల మీద ముద్దు పెట్టుకున్నాడు.

''స్వాతీ! నీ పెదవులెంత తియ్యగా వున్నాయి? ఏ అమృతం తాగావు ?''

స్వాతి ముఖం చేతుల్తో కప్పుకుంటూ — ''ఏమో నాకేం తెలీదు! అయినా రోజూ లంచం లేందే వెళ్లరా !''

''ఉహు! వెళ్లితే ఇక నిద్రపట్టదు.''

''మీరిలా చేస్తుంటే నాకూ నిద్రపట్టదు.''

''నిద్రపట్టదా! అయితే ఒక వుపాయం చెప్పనా!'' అన్నాడు స్వాతి ముఖంలోకి చూస్తూ —

''ఏమిటది ?''

''మీ దొడ్డివేపు తలుపు తీసివుంచు! రాత్రికి వస్తా'' అన్నాడు నవ్వుతూ.

స్వాతి కోపంగా చూస్తూ — ''రామ, రామ మీ వ్యవహారం శ్రుతిమించులోంది!'' అంది.

''మించదూ మరి! తొందర్లో మన పెళ్లి

[36 వ పేజీ చూడండి]



రాకుండా వుంటే ఇంకా మించుతుంది" అన్నాడు బయటికి నడుస్తూ.

స్వాతి రవి వెనకాలే బయటికి వచ్చి – "రేపు వస్తావా!" అంది.

"రాకుండా వుండగలనా !" అని వెళ్లిపోయాడు

* * *

"మోహన్ ! గొలుసు చేయిస్తానన్నావు ఏదీ !"

హోటల్లో కూర్చుని వుండగా మోహన్ని అడిగింది కళ్యాణి

చేతిలోని కప్పు టేబిల్‌మీద పెట్టి – "చేయిస్తాను కళ్యాణీ !" అన్నాడు.

ఆ మాటలకి కళ్యాణి ముఖం చిట్లించింది.

"మోహన్ ! ఈ మాట నెలరోజుల్నించీ చెప్తున్నావ్ ! ఇంకా ఎన్నిరోజులు ఇలా చెప్తావ్ ?"

"కళ్యాణీ ! నీకు కావాల్సింది గొలుసా ? నేనా ?" అనడిగాడు తీవ్రంగా.

ఆ మాటకి తడబడిపోతూ—"నువ్వే అనుకో! ప్రస్తుతం మాత్రం గొలుసు కావాలి ?"

"కళ్యాణీ ! ఒక్క విషయం చెప్పనా ?"

"చెప్పు !" చిరాగ్గా అంది

"కళ్యాణీ ! ఇప్పటికే నీ గురించి చాలా అప్పులు చేశాను. ఇక చెయ్యలేను !"

కళ్యాణి తెల్లబోయింది.

# ప్రేమిస్తే ఏమౌతుంది?

[29 వ పేజీ తరువాయి]

"అప్పులా ! ఎందుకు?"

"ఎందుకేమిటి ? నీకు కొన్న చీరలు, ఇచ్చిన డబ్బు ఎక్కడినుంచి వచ్చాయనుకున్నావ్ ?" అని ప్రశ్నించాడు.

"నీకు నెయ్యి రూపాయలు వస్తున్నాయి ఆ డబ్బు ఏం చేస్తున్నావ్ ?"

మోహన్ చిన్నగా నిట్టూర్చాడు.

"కళ్యాణీ ! నీకు అసలు విషయం తెలీదు. ఎన్నాళ్లనుంచో నీకు చెప్పాలనుకుంటూ వుండే వాడిని. మాది పెద్ద కుటుంబం. నాన్నగారికొచ్చే డబ్బు చాలదు ఇంటికి ప్రతినెలా అయిదొందలు పంపాలి. ఒకోక్కసారైతే ఇంకా ఎక్కువ పంపాల్సి వస్తుంది. ఏం చేస్తాం. తప్పదు కదా !"

కళ్యాణి ఆ మాటలు విని ప్రాన్పడిపోయింది! ఇన్నాళ్లూ తనకీ విషయాలు తెలీదు. మోహన్‌కి కూడా తనలాగే బాధ్యతలున్నాయా ? కంపెనీ మేనేజరు, డబ్బున్నవాడనుకుంది. మోహన్ని పెళ్లి చేసుకోవాలనుకుంది కూడా ! ఇంకా నయం! మోహన్‌తో అనలేదు ! ఇక మోహన్ నుంచి తనకు పైసా రాదన్నమాట ! మోహన్‌తో స్నేహం తెంచుకోవాలి ! పోనీలే ! వెలుతురుండగానే కళ్లు తెరుచుకుంది.

"కళ్యాణీ ! మాట్లాడవే ! నా గురించి చెప్పి నిన్ను బాధపెట్టానా ?"

"అబ్బే ! లేదు !" అంది పొడిగా.

"కళ్యాణీ ! నువ్వు నా ప్రక్కనుంటే ఇటువంటి బాధల్ని ఎన్నిటినైనా భరించగలను కళ్యాణీ ! జీవితంలో ఏది లేకపోయినా విచారించను నేను. నీ ప్రేమ ఒక్కటే చాలు నాకు."

మోహన్ ఆవేశంగా చెప్పుకుపోతున్నాడు.

కళ్యాణి ఆ మాటలేవీ వినడంలేదు ! మోహన్ గొలుసు ఇస్తాడని ఎన్నో ఆశలు పెట్టుకుంది ఆ గొలుసుని కాలేజీలో అందరికీ గొప్పగా చూపించాలనుకుంది. ప్చ్ ! ఛాన్సుపోయింది.

"ఇక లేద్దామా ! మోహన్ !" అంది బ్యాగ్ చేతికి తగిలించుకుంటూ

తను ఆశించిన రెస్పాన్సు కళ్యాణి నుంచి రానందుకు మోహన్ బాధపడ్డాడు. అయినా కళ్యాణికి తనమీద ఎటువంటి అభిప్రాయం వుందో తెలుసుకోకుండానే తను తన విషయం చెప్పి పొరపాటు చేశాడేమో !

"కళ్యాణీ ! నేను అన్నదానికి ఏం సమాధానం చెప్పలేదే ?" అన్నాడు వుండబట్టలేక.

"తర్వాత చెప్తాలే ! చీకటి పడుతోంది !" అంది విసుగ్గా.

మోహన్‌కి నిరాశ కలిగినా చేసేదిలేక అక్కడి నుంచి లేచాడు.

ఆ రాత్రే కళ్యాణి నిర్ధారణ చేసుకుంది. ఇక మోహన్‌తో తెగతెంపులు చేసుకోవాలని.

* * *

ఈమధ్య మళ్లీ అన్నయ్య దగ్గర్నించి శెలవులకు రమ్మంటూ వుత్తరం వచ్చింది స్వాతికి. కానీ రవిని వదిలి వెళ్లాలనిలేదు

అందుకే పేపర్లు దిద్దాలి, అవి అయ్యాక వస్తానని రాసింది.

రవి ఈమధ్య సరిగ్గా రావటంలేదు.

ఏమిటంటే, కంపెనీ పని అంటాడు.

రవి ఒక్క రోజు రాకపోతే, ఇక ఎప్పటికీ రాడేమో అన్పిస్తుంది.

అది రవికి చెప్తే అతడు నవ్వేస్తూ –

"అంతే స్వాతీ ! ప్రేమంటే అలాగే వుంటుంది" అంటాడు.

రవి రానప్పుడు ఒక్కొక్కసారి అన్పిస్తుంది. రవి నిజంగా తనని ప్రేమించి వుండడు ! ఏదో అందంగా, ఆకర్షణీయంగా కన్పిస్తే కొన్నాళ్లు కాలక్షేపం చేద్దామని తనతో స్నేహంచేసి వుంటాడు. ఆ మోజు తీరాక తనని మర్చిపోతాడు.

ఇప్పుడు బహుశ తనని మర్చిపోయే స్థితిలో వున్నాడేమో ! లేకపోతే ఎందుకు రాడు ? తను అతన్ని చూడాలని, అతనితో మాట్లాడాలని ఇంత తపించిపోతోందే! అతనికేమైనా వుందా ?

ఛీ ! ఈ మగవాళ్లకు స్త్రీల కున్నంత గాఢమైన ప్రేమ వుండదు.

ఇలా అనుకుంటుండగానే రవి వచ్చాడు. స్వాతి కోపంతో మాట్లాడకుండా కూర్చుంది.


## జాతీయ భాషా సమైక్యతా గ్రంథములు

తెలుగు భాష మాత్రము చదవగలిగినవారు యితర రాష్ట్రములకు పోయి ఆ దేశములో స్థిరపడిన తరువాత వ్యాపారము గాని, విద్యా సంస్థలయందు గాని, ఉద్యోగ సంస్థలయందు గాని ఆ దేశ ప్రజలతో వ్యవహరించుటకు కష్టపడేవారికి, దినచర్యకు ఉపయోగించే వార్తలు చేర్చి, సులభంగా వ్యాకరణ లోపం లేకుండా వ్రాయడానికి, చదవడానికి మరియు ఆ దేశ ప్రజలతో తేలికగా వ్యవహరించుటకు, ఈ క్రింది వివరించబడిన ఉత్తమ గ్రంథములు.

| | వెల రూ. | | వెల రూ. |
|---|---|---|---|
| 30 రోజులలో హిందీ భాష | 4-50 | 30 రోజులలో మరాఠీ భాష | 4-50 |
| 30 రోజులలో కన్నడ భాష | 4-50 | 30 రోజులలో గుజరాతీ భాష | 5-50 |
| 30 రోజులలో మలయాళీ భాష | 4-50 | 30 రోజులలో ఒరియా భాష | 5-50 |
| 30 రోజులలో సంస్కృత భాష | 5-50 | 30 రోజులలో ఉర్దూ భాష | 5-50 |
| 30 రోజులలో ఆంగ్ల భాష | 7-50 | 30 రోజులలో తమిళ భాష | 4-50 |
| 30 రోజులలో బెంగాళీ భాష | 4-50 | 30 రోజులలో పంజాబీ భాష | 5-50 |

ఆంగ్ల సంభాషణం - తెలుగు వెల రూ. 7-30

మీరు పుస్తకాలకు ఆర్డర్ చేసేటప్పుడు పుస్తకాల వెలలో తప్పనిసరిగా సగం అడ్వాన్సుగా పంపాలి. మిగతా సొమ్ముకు వి.పి.గా పంపుతాము.

Also learn all our National Languages in 30 days through your mother tongue

BP

Balaji Publications
103, Pycrofts Road, Madras-600 014

"రాణీగారు మౌన వ్రతం పట్టినట్లున్నారు. అయితే నేను రేపు వస్తాను" అన్నాడు రవి నవ్వుతూ.

అప్పటికీ స్వాతి మాట్లాడలేదు. పుస్తకం తిరగేస్తూ కూర్చుంది.

"సరే! మీరు పుస్తకం చదువుతూ వుండండి! మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్యడం నా కిష్టంలేదు!" అంటూ కుర్చీలోంచి లేచాడు.

రవి నిజంగా వెళ్ళిపోతాడేమోనని భయం కలిగింది స్వాతికి.

కాని తనంతట తాను మాట్లాడ్డం ఇష్టంలేదు రవి కాస్సేపు బ్రతిమిలాడాలి! అప్పుడు మాట్లాడాలి! కాని రవి కుర్చీలోంచి లేవగానే —

"వెళ్ళండి! పాపం చాలా పనులున్నాయనుకుంటాను" అంది నిష్ఠూరంగా.

రవి తిరిగి కుర్చీలో కూర్చుని, "అయితే! అది వ్రతం కాదన్నమాట! నామీద కోపమా!"

"కోపం రాదా? మీరు ఎప్పుడు వస్తానన్నారు? ఎప్పుడు వచ్చారు? ఇచ్చిన మాటని నిలబెట్టుకోవాలండీ!"

"మీకేం అయిదయ్యేసరికి కాలేజీనుండి వచ్చి కూర్చుంటారు. మాది అలా కాదు! మాది ప్రైవేటు కంపెనీ. మా బాస్ ఒక రాక్షసుడు! వాడికి ఇల్లూ, వాకిలీ అక్కర్లేదు. మిగతావాళ్ళు కూడా అలాగే పనిచేయాలంటాడు. ఇక నాలాటి బ్రహ్మచారుల్ని చచ్చినా వదలడు."

"అయితే మాత్రం ఇన్ని రోజులా! చూడాలని వుంటే ఎలాగైనా రావచ్చు! మనసుంటే మార్గముంటుందండీ!" అంది నిష్ఠూరంగా.

"నాకు మనసుందో లేదో నీకు తెలుసు వేరే నేను చెప్పడం దేనికి!" అన్నాడు.

ఆ మాటతో స్వాతి కోపం కరిగిపోయింది రవిని తప్పుగా అర్థం చేసుకున్నందుకు బాధపడింది

"అదికాదు రవీ! మీరు ఒక్కరోజు రాకపోతే నేనుండలేను!"

"నాకు మాత్రం రావాలని వుండదా? అందునా ఎంతోకాలం వేచి ప్రసన్నురాలిని చేసుకున్న నా దేవతని చూడకుండా నేను వుండగలనా! ఏం చేయను! ఏవో పనులు! ఒక్కొక్కసారి అనిపిస్తుంది! ఈ ఉద్యోగానికి రిజైనిచ్చి హాయిగా నీతో కబుర్లు చెప్పుకుంటూ వుండిపోవాలని! కాని ఏం చెయ్యను! అది సాధ్యం కాదుకదా?"

ఆ మాటల్తో స్వాతి మనస్సు ఆనందంతో పుప్పొంగిపోయింది.

"రవీ! ఇదే! అదే రవీ! ఆ ప్రేమే నేను కోరుకునేది!" అనుకుంది మనస్సులో.

"రవీ! రోజూ పుదయం లేస్తూనే సాయంత్రం ఎప్పుడవుతుందా! ఎప్పుడెప్పుడు మిమ్మల్ని చూస్తానా అనిపిస్తుంది సాయంత్రం అయిదు తర్వాత కాలేజీలో ఒక్క క్షణం వుండబుద్ధి కాదు. ఒకవేళ కాలేజీలో ఏదైనా మీటింగు కానీ, ఫంక్షన్ కానీ వుందని తెలిస్తే ఇక నా బాధ చెప్పనలవి కాదు. మనసంతా ఇక్కడే వుంటుంది. ఫంక్షన్ అవగానే పరిగెట్టుకు వస్తాను. అప్పుడు కనుక మీరు రాలేదని తెలిస్తే ఎంత బాధ, కోపం వస్తాయో తెలుసా? ఇక ఆ పూట అందరిమీదా చెప్పరాని చిరాకు వస్తుంది. ఈ లోకమంతా శూన్యంగా అన్పిస్తుంది! రవీ! నా మాటలు విని నవ్వుకుంటున్నారా?"

"ఛ! నవ్వడమెందుకు! నాకు అంతకన్నా కావల్సిందేముంది? నీ నోటి నుంచి ఇటువంటి మాటలు వినాలనేగా నేనిన్నాళ్ళూ ఎదురుచూసింది. స్వాతీ! ఇక లాభంలేదు. మీ నాన్నగారితో మాట్లాడేస్తాను."

"ఏ విషయం?"

"మన పెళ్ళిని గూర్చి! రాధకి కూడా చూస్తున్నాను. వీలుంటే వచ్చేనెలలో మన పెళ్ళిళ్ళు జరుగుతాయి! ఇక ఆ తర్వాత .." రవి నవ్వుతూ స్వాతి ముఖంలోకి చూశాడు.

"ఆ తర్వాత ... ఆకాశంలో పక్షుల్లా—నదిలో చేపల్లా — హాయిగా గడుపుతారు కాలం! కోరుకున్న వ్యక్తితో పెళ్ళి!

ఇంతకంటె అదృష్టం ఏముంటుంది! తనింతవరకూ ఎన్నో ప్రేమల గూర్చి చదివింది! అన్ని ప్రేమలూ చివరికి విషాదాంతాలే అయ్యాయి! ప్రేమించిన వాళ్ళల్లో కొద్దిమంది మాత్రమే పెళ్ళి చేసుకోగలిగారు! పెళ్ళి చేసుకున్న వాళ్ళు కూడా కొన్నాళ్ళకి ఏవో గొడవలు వచ్చి విడిపోయారు! తాము పెళ్ళి చేసుకున్నందుకు విచారించారు!

కాని తను ప్రేమించినవాడిని పెళ్ళిచేసుకోబోతోంది! తను రవిని దైవంలా పూజిస్తుంది!




ం సంసారంలో ఎటువంటి కలతలూ రావు. తమ
తం ఆనందమయం అవుతుంది! తమ కిద్దరు
లు చాలు! వాళ్లని తన అభిరుచుల కనుగుణంగా
ంచుతుంది.

తానూ, రవీ, తన పిల్లలతో ఇల్లు
ట్ హోమ్ అవుతుంది."

స్వాతి కలల్లో తేలిపోసాగింది.

* * *

"స్వాతీ! ఈ మధ్య అస్సలు మాటలే
ంవయ్యాయే!" అంది ఒకరోజు కళ్యాణి, నోటు
క్సు దిద్దుకుంటూ!

"నువ్వు మాత్రం మాట్లాడుతున్నావా!"
ంది స్వాతి.

"నా విషయం వదిలెయ్!"

"ఎందుకనో? అది సరేగానీ మొన్న స్కూటర్
ంద కన్పించావ్! ఎవరతను?"

"అతనా! నా కొత్త ఫ్రెండు శేషగిరిలే"
ంది కళ్యాణి తేలిగ్గా.

స్వాతి ఆశ్చర్యపోతూ "కొత్త ఫ్రెండా!"
ంది.

"అవునే! పెద్ద బిజినెస్ మేగ్నెట్! నేనాయన్ని
ప్రేమిస్తున్నానే!"

"ఇంతకుముందు కూడా ఇంకో ఇద్దర్ని ఇలాగే
ప్రేమిస్తున్నట్లు చెప్పిన గుర్తుంది. అవునా!"

దానికి కళ్యాణి నవ్వేస్తూ — "అవునే! వాళ్లని
ప్రేమించాననుకున్నాను. కానీ నేను నిజంగా
ప్రేమించేది ఇతన్నే"

"కొన్నాళ్లు పోయాక ఇంకో వ్యక్తి పేరు
చెప్తావేమో!"

"ఏమో! చెప్పినాచెప్పొచ్చు" అంటూ బుక్కుల్లో
చకచకా టిక్కులు పెట్టేస్తోంది.

కళ్యాణి ధోరణికి మండిపోయింది స్వాతి.
"కళ్యాణీ! నీది ప్రేమ కాదే వ్యామోహం! డబ్బు
మీది ఆశ! ఎవడు బాగా డబ్బున్నవాడిలా కన్పిస్తే
వాడితో తిరుగుతావు. నీ వ్యామోహానికి ప్రేమనే
పెద్ద మాట వాడి ఆ మాట విలువ కూడా
పాడుచేస్తావెందుకే? ప్రేమ అనేది ఎంత మహత్తర
మైనదో నీలాటివాళ్లకు తెలీదు."

కళ్యాణి నవ్వుతూ — "ఉపన్యాసం బాగానే
వుంది. నీకు ప్రేమ గూర్చి చాలానే తెలుసన్న
మాట" అంది.

కళ్యాణి తన మాటల్ని తేలిగ్గా తీసుకోవడంతో
స్వాతి చిన్నబుచ్చుకుంది.

"నాకు తెలుసని అనలేదు! నిన్ను ఆ మాట
అనొద్దంటున్నాను. అయినా కళ్యాణీ! నీ ప్రవర్తన
నాకేం బాగాలేదు."

కళ్యాణి తలెత్తి స్వాతి వేపు చూసింది.

"స్వాతీ! ఇదివరకోసారి ఇటువంటి సందర్భ
మొస్తే చెప్పాను. మళ్లీ చెప్తున్నాను విను. నాకు
డబ్బు కావాలి. అదిచ్చే సుఖాలు కావాలి! నాకు
డబ్బు లేదు కానీ అందం వుంది. దానితో డబ్బు
సంపాదిస్తున్నాను. నువ్వు నన్ను తిట్టినా, అసహ్యించు
కున్నా నా పద్ధతి మార్చుకోలేను" అంది ఖచ్చితంగా.

కళ్యాణి కుటుంబ స్థితి తెలుసు. అందుకే
కళ్యాణి మీద జాలి కలిగింది.

"కళ్యాణీ! ఒక్క సలహా విను! ఒక డబ్బున్న
వాడిని చూసి పెళ్లి చేసుకుంటే ఏ బాధా వుండదు
కదా!"

"ఈ సలహా బావుంది! నేనూ అదే
చూస్తున్నాను. ప్రస్తుతం ఆ వేటలోనే వున్నాను"
అంది కళ్యాణి.

బెల్ అయింది!

స్టాఫ్ రూమ్‌లోకి లెక్చరర్లు ఒకరొకరే
రావడంతో స్వాతి మాటలు ఆపేసింది.

కళ్యాణి పూర్తిగా నాశనమవకముందే ఎవడైనా
డబ్బున్నవాడు ముందుకు వచ్చి కళ్యాణిని చేసుకుంటే
బాగుండునన్పించింది స్వాతికి

రవికి కళ్యాణి విషయం చెప్పాలి. ఏదైనా
సలహా చెప్తాడేమో!

తన కళ్ల ఎదుటే తన స్నేహితురాలు నాశన
మవుతూంటే తను చూస్తూ వూరుకోలేదు.

* * *

ఒకరోజు సాయంత్రం స్వాతి కాలేజీ నుండి
వచ్చి వరండాలో కూర్చుని పుస్తకం చదువుకుం
టోంది. గేటు చప్పుడయితే తలెత్తి చూసి
ఆశ్చర్యపోయింది!

రాధ గేటు తీసుకుని వస్తోంది.

చటుక్కున కుర్చీలోంచి లేచి — "రండి ...
రండి!" అంటూ ఆహ్వానించింది.

రాధ మెట్లెక్కి వరండాలోకి వచ్చింది.

రాధ ఒంటరిగా రావడం స్వాతికి వింతగా
తోచింది. రాధవేపు చూసింది.

రాధ ముఖం ప్రసన్నంగాలేదు. ముఖంలో
విచారం తొంగి చూస్తోంది. ఆ విశాలమైన
కళ్లల్లో బాధా, దిగులూ, భయం కన్పిస్తున్నాయి!

ఎందుకలా వుంది?

"కూర్చోండి!" అంది స్వాతి.

రాధ కూర్చుంది.

"ఒక్కరే వచ్చారా?"

"అవునండీ!"

"మా ఇల్లు తెలుసుకున్నారే?"

"రావాలనుకున్నప్పుడు తెలుసుకోవాలిగదా?"
అంది రాధ.

"ఆహా!" అంది స్వాతి.

క్షణం ఆగి స్వాతే అంది— "మీ అత్తయ్యగారు
బావున్నారా? మళ్లీ మీ ఇంటికి రావాలనుకున్నాను!
కానీ కాలేజీ వర్క్‌తో బిజీగా వుండటం వలన
కుదరలేదు!"

రాధ ఏం మాట్లాడలేదు.

రాధ ఎందుకు వచ్చిందో తెలుసుకోవాలని
ఆరాటంగా వుంది స్వాతికి.

రాధ చెప్పే మాట కోసం చూస్తోంది.
అయిదు నిముషాలు గడిచాయి!

రాధ హఠాత్తుగా అంది — "మిమ్మల్నొక
కోరిక కోరాలని వచ్చాను."

"ఏమిటో చెప్పండి?"

"రవి బావకూ, నాకూ పెళ్లయ్యేట్లు మీరు
చూడాలి!" అంది రాధ.

ఆ మాట విని స్వాతి కొయ్యబారిపోయింది.

"స్వాతీ! రవి బావ మిమ్మల్నే చేసుకుంటా
నంటున్నాడు. రవి బావమీదే నేను చిన్నప్పట్నుంచీ
ఆశలు పెట్టుకున్నాను. అతడే నా భర్త!
అనుకుంటూ వచ్చాను. బావ నా కిప్పుడు వేరే పెళ్లి
చేస్తానంటున్నాడు. కానీ నేను చేసుకోలేనండీ!
బావని తప్ప ఇంకెవర్నీ చేసుకోలేను" ఆవేశంగా
అంది రాధ.

"ఆ విషయం మీ బావతో చెప్పలేకపోయారా?"
అనడిగింది స్వాతి.

ఆ మాటకి రాధ నవ్వింది!

"ప్రస్తుతం మా బావకి నాతో మాట్లాడ్డానికే
తీరికలేదు. ఇక ఈ మాటలు వింటాడా? అక్కా!

## రేపటి భయాలు

మొన్న అవసరం లేనివి
నిన్న కనీస అవసరాలు కాగా,
నేడవే అత్యాసలౌతోంటే
రేపు ప్రాణాధారమైన
గాలినికూడా పైసాలు పెట్టి
కొనుక్కోవాలేమోనని భయం

మొన్నటి అలవాట్లు
నిన్నటి ఆచారాలు కాగా
నేడవి దురాచారాలుగా
పట్టి పీడిస్తూంటే
రేపింకా వాటికి ఎన్ని
జీవితాలు బలౌతాయోనని భయం

మొన్న ఊసుపోకకి పుట్టిన
కుల మతాలు
నిన్న మనుషుల మధ్య
చీలికలు తేగా
నేడు వాటిమత్తులో
కుత్తుకలు తెగుతూంటే
రేపీ తత్వం మనిషి
మనుగడనే మసి చేస్తుందేమోనని భయం

మొన్న, నిన్నటివారు
భయాల్నెదురొడ్డి పోరాడగా
నేడు వారి వారసులుగా
మిగిలిన మనం
భయాలకి బానిసలుగా
బ్రతుకుతూన్నాం
రేపటి ప్రపంచపు వార్‌లో
మరి మనకి వారసుల
మిగిలరేమోనని భయం

— పి. మురళీధరరావ్

---

అనివార్య కారణాలవల్ల 'బొమ్మల
భారతం' ఈవారం పడలేదు. —సం:

మీరు చదువుకున్నవారు, నన్నర్థం చేసుకుంటారని మీ దగ్గిరికొచ్చాను.''

'అక్కా' అన్న రాధ పిలుపు స్వాతి హృదయాన్ని తాకింది.

''అక్కా! నాకు అమ్మా, నాన్న చిన్నప్పుడే పోయారు. అత్తయ్య నన్ను పెంచింది. ఇన్నేళ్ళల్లోనూ నాకెప్పుడూ అమ్మా, నాన్న జ్ఞాపకం రాలేదంటే దానిక్కారణం అత్తయ్య ఆదరణ, బావ అభిమానం! చిన్నప్పుడు నేను సరిగ్గా చదవకపోతే చదువులేని పిల్లను చేసుకోను అనేవాడు బావ! ఎప్పుడైనా కోప్తే విచారంగా కన్పిస్తే ఇలా ఏడుస్తూ వుంటే నిన్ను చేసుకోను అనేవాడు. బావ మాటలతో అతడే నా భర్త అనే భావం నాలో దృఢపడింది. మొన్న మొన్నటివరకూ కూడా రోజుకో గంటసేపైనా నాతో మాట్లాడందే నిద్రపోయేవాడు కాదు బావ! అటువంటిది ఈమధ్య పూర్తిగా మారిపోయాడు. రోజు మొత్తంమీద అయిదు క్షణాలు కూడా మాట్లాడ్డంలేదు.''

రాధ కంఠం రుద్ధమైంది! కళ్ళమ్మట నీళ్ళు కారుతున్నాయి.

''అక్కా! ఇప్పుడు మీరే నాకు దిక్కు!'' అని స్వాతి కాళ్ళమీద పడింది రాధ.

స్వాతి ఈ హఠాత్సంఘటనకు తడబడిపోయింది. క్షణకాలం ఏం చెయ్యాలో తోచలేదు! రాధ కన్నీళ్ళు పాదాల్ని అభిషేకిస్తున్నాయి!

స్వాతి గబుక్కున రాధని లేవనెత్తి — ''రాధా! నీ బావ నీకు దక్కేట్టు చేస్తాను, సరేనా!'' అంది అప్రయత్నంగా.

ఆ మాటతో రాధ కళ్ళు మిలమిలా మెరిశాయి!

స్వాతి చేతులు పుచ్చుకొని కళ్ళ కద్దుకుంటూ— ''అక్కా! మీ గురించి బావ చెప్తూంటేనే అనుకున్నాను — మీరెంతో మంచివారని. అందుకే మీ దగ్గిరికిలా పరిగెట్టుకువచ్చాను. అమ్మయ్య! నా మనస్సు తేలికపడింది. అక్కా! మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను.''

రాధ ఏదేదో చెప్తోంది.

స్వాతి ఆ మాటలు వినడంలేదు. రాయిలా కూర్చుంది.

రాధ లేచి నిలబడి — ''అక్కా! చీకటి పడుతోంది! అత్తయ్యతో చెప్పకుండా వచ్చాను! వస్తాను'' అని వెళ్ళిపోయింది.

స్వాతి అలాగే కూర్చుంది.

మనసంతా మొద్దుబారిపోయింది. అయిదు నిముషాలగ్గానీ ఆ షాక్‌నుండి తేరుకోలేకపోయింది.

జరిగిందంతా జ్ఞప్తికి వచ్చింది!

ఏమిటిది?

ఎందుకిలా జరిగింది? రాధ కోరగానే తానెందుకు ఒప్పుకుంది? త్యాగాలు చెయ్యడానికి ఇదేం కథ కాదు కదా!

ఇది జీవితం!

ఇది తన దగ్గరున్న చీర ఇవ్వటం కాదు! తన దగ్గరున్న నగ ఇవ్వటం కాదు! మనసారా ప్రేమించిన వ్యక్తిని ఇవ్వటం!

రవిని వదిలి క్షణమైనా వుండలేదే! అటువంటిది అతనిని శాశ్వతంగా వదలుకోడమా! తనకది సాధ్యమేనా! ఎందుకలా మాట ఇచ్చింది! ఏ బలహీనత తననలా చేయించింది. తనమీద తనకే కోపం వచ్చింది, చిరాకు కల్గింది.

ఏం చెయ్యాలి ఇప్పుడు?

యుగయుగాల్నించీ ప్రేమకథలు ఇలాగే అంతమవుతున్నాయి.

ప్రేమించిన వాళ్ళు సుఖపడటంలేదు!

తన కథ వేరుగా వుంటుందనుకుంది! కానీ తనదీ అంతేనా!

రవితో పరిచయమై ఆరునెలలే అయినా తమది ఎన్నాళ్ళ బంధమో అన్పిస్తోంది!

రవి తియ్యని మాటలు ఇక తను వినలేదు! అతని కళ్ళల్లోని మెరుపుని చూడలేదు!

దుఃఖమూ, బాధా మనసుని పెనవేశాయి!

ఆత్మహత్య చేసుకుంటే! కాని తనమీదే ఆశలు పెట్టుకున్న అమ్మా, నాన్నగారు ఏమౌతారు?

బ్రతికుంటే ఈ చిత్రహింస ఎలా భరించడం?

మనుషుల మధ్య ఇటువంటి అనుబంధాలెందుకేర్పడతాయో!

భగవంతుడు తనకెటువంటి పరిస్థితి కల్పించాడు! రాధ వచ్చి తనను ఇలా అడిగే పరిస్థితి వస్తుందని వూహించివుంటే రవితో తన అనుబంధాన్ని పెంచుకునేది కాదు!

ప్చ్! ఇప్పుడు ఎన్ని అనుకుని ఏం లాభం!

తన కాపురాన్ని గూర్చి ఎంతో వూహించుకుంది! అవన్నీ కలలుగానే మిగిలిపోయాయి! ఇప్పటివరకూ తనెంతో అదృష్టవంతురాల్నని మురిసిపోయింది!

కానీ లోకంలో తనలాటి దురదృష్టవంతురాలు లేదని ఇప్పుడే తెలుసుకుంది.

ఆలోచనలతో తల వేడెక్కిపోయింది! మనసు అలిసిపోయింది! కుర్చీలో వెనక్కి ఆనుకుని కూర్చుంది! అలా ఎంతసేపు కూర్చుందో?

''అమ్మా! స్వాతీ! అలా చీకట్లో కూర్చున్నావేమ్మా?''

గోవిందరావు వాకింగ్ నుంచి వచ్చి వరండాలో కూర్చున్న స్వాతిని చూసి అన్నాడు.

స్వాతి తండ్రి గొంతు విని సర్దుకు కూర్చుంది.

''అలావున్నావేమ్మా?''

స్వాతి లేని నవ్వు తెచ్చుకుని — ''ఏం లేదు నాన్నా!'' అంది.

దిగాలుగా వున్న స్వాతిని చూశాక స్వాతికి త్వరగా పెళ్ళి చేయాలన్పించింది. ఇప్పటికే ఆలస్యం చేసి పొరపాటు చేశాడు ఈ వయస్సులో ఆడపిల్లలకి తోడు అవసరం.

''అమ్మా స్వాతీ! అన్నయ్యకు ఏమని వుత్తరం రాయమన్నావు?''

స్వాతి మనస్సులో అన్నయ్య వ్రాసిన వుత్తరం మెదిలింది.

'స్వాతికి ఇక్కడో మంచి సంబంధం చూశాను. నేను వారం రోజుల్లో అక్కడికి వస్తాను. వచ్చేటప్పుడు కుర్రాడిని కూడా తీసుకువస్తాను. ఏ సంగతీ వ్రాయండి!' అని వ్రాశాడు.

వుత్తరం వచ్చి రెండ్రోజులయింది!

తండ్రి ఈ విషయం ప్రస్తావిస్తే రవిని గూర్చి చెప్పాలనుకుంది స్వాతి

తండ్రి అడిగాడు!

కాని...

''ఏమ్మా! మాట్లాడవే? నిన్నడిగి వ్రాయాలని ఆగాను.''

''నీ ఇష్టం నాన్నా!'' అని లోపలికెళ్ళిపోయింది.

'పిచ్చితల్లి! ఆడపిల్ల ఇంతకన్నా ఏం చెప్తుంది? రేపే రెండోవాడికి వుత్తరం వ్రాయాలి' అని అనుకున్నాడాయన.

(ఇంకా ఉంది)



పెద్దకథ

# ప్రేమిస్తే మమతేయిది?

## విన్నకోట సుశీలాదేవి



"రాణీగారు మళ్లీ అలిగినట్టున్నారు!" రవి నవ్వుతూ పలకరించాడు.

స్వాతి మనస్సు బాధగా మూలిగింది. "రవీ! అలా మాట్లాడకు! నా గుండెలు బద్దలయి పోతాయి!" అనుకుంది.

స్వాతికి దగ్గరగా కుర్చీ జరుపుకుని "అలా వున్నావే?" అంటూ చేతిని పట్టుకున్నాడు.

స్వాతి చేయి విదిలించుకుంది.

"స్వాతీ! కోపం నీకెంత అందాన్నిచ్చినా, రోజూ ఇలా అలగడం ఏం బాగాలేదు!" అన్నాడు.

"రవీ! వచ్చే నెలలో నా పెళ్లి!" అంది స్వాతి నెమ్మదిగా.

"ఓ అదా! నీ పెళ్లి కాదు, మన పెళ్లి అనాలి స్వాతీ! నాకు మాత్రం లేదా త్వరగా పెళ్లి చేసుకోవాలని! ముందు రాధ పెళ్లి కావాలని నువ్వే ఒట్టుబట్టావ్! రాధకి సంబంధాలు చూస్తున్నా. ఎలాగైనా సరే వచ్చే నెలలో మన పెళ్లి జరుగుతుంది సరేనా?"

రవికి ఎలా చెప్పాలో తోచలేదు. "అదికాదు రవీ! నాకు పెళ్లి సంబంధం చూస్తున్నారు నాన్న."

రవి తెల్లబోయాడు –

"స్వాతీ! నిజమేనా! మరి నువ్వు మన విషయం చెప్పలేదా!"

"ఉహూ!"

"ఏం?"

"ఏముంది! ఆ అబ్బాయి మీకంటే బాగుంటాడు. మంచి వుద్యోగం, బోలెడంత డబ్బు వుంది. ఇంకెందుకు కాదనాలి?"

స్వాతి మాటలు పూర్తి అయ్యాయో లేదో, స్వాతి చెంప ఛెళ్లుమంది.

"స్వాతీ! ఇంకోసారి అలా మాట్లాడావంటే, జాగ్రత్త!" రవి కళ్లు నిప్పులు కురిపిస్తున్నాయి.

"రవీ" అంది బాధగా చెంప పట్టుకుని.

స్వాతి కళ్లల్లోని నీటిని చూసి రవి తెలివి తెచ్చుకున్నాడు. రవి తనని తాను సంబాళించుకుంటూ –

"స్వాతీ! నువ్వు జోక్‌గా అన్నా నేను భరించలేను. ఆవేశంలో తొందరపడ్డాను. సారీ స్వాతీ! నన్ను క్షమించు! నా ప్రేయసిని, పూజించాల్సిన నా దేవతని ఈ చేత్తో కొట్టాను. ఛీ! నేనెంత పశువునయ్యాను! ఈ చేతిని..." అంటూ కుడిచేతిని టేబిల్‌మీద వేసి కొట్టుకోసాగాడు.

(గత సంచిక తరువాయి)

స్వాతి లేచి రవి చేతిని పట్టుకుంది. రవి కళ్లనుండి నీళ్లు చెంపలమీదికి జారుతున్నాయి!

"రవీ" అంటూ స్వాతి రవి గుండెలమీద వాలి భోరుమంది.

రవి స్వాతి చుట్టూ చెయ్యివేసి ఆప్యాయంగా దగ్గరికి తీసుకున్నాడు.

స్వాతి కొద్దిసేపటికి తెప్పరిల్లింది. ముఖం కొంగుతో తుడుచుకుంది. కుర్చీలో కూర్చుంది.

రవి స్వాతి కూర్చున్న కుర్చీ హేండ్‌మీద కూర్చుని –

"అసలు ఏం జరిగిందో చెప్పు స్వాతీ!" అన్నాడు.

**జరిగిన కథ–4:** రెవెన్యూ సెక్షన్ట్ మెంటులో తాసిల్దారుగా పనిచేసి రిటైరయిన గోవిందరావుకి, ఆయన భార్యకు ఇద్దరు మగపిల్లల తర్వాత పుట్టిన స్వాతి అంటే అమితమైన గారాబం. స్వాతి ఓ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తూంటుంది. ఉమ కోరికమీద ఆమె బర్త్‌డే పార్టీకి వెళ్లిన స్వాతికి అక్కడ రవి పరిచయమౌతాడు. స్వాతి ఇంటికి రవి రాకపోకలు సాగిస్తుంటాడు. ఆమెలో అతను చోటు చేసుకొంటుంటాడు. రవి మాటల్లో తన మావయ్య కూతురు రాధ విషయం రాగా ఎందుకో అతను తనని మోసం చేస్తున్నాడేమో! అనే అనుమానం చిగురుస్తుంది స్వాతిలో. రవి తన మామయ్యకు ఇచ్చిన మాట ప్రకారం అతను రాధనే చేసుకొంటాడని కళ్యాణి ద్వారా తెలుసుకున్న స్వాతి కుమిలిపోతుంది. కానీ, తను రాధను ప్రేమించటంలేదనీ స్వాతినే ప్రేమిస్తున్నాననీ, ఆమె ప్రేమ లభించని నాడు తాను బ్రతకననీ అన్న రవి మాటలకు ఆమె మనసు కుదుటపడుతుంది. ఆ తరువాత అతని రాక కోసం ప్రతిరోజూ నిరీక్షిస్తూంటుంది. స్వాతి కొలీగ్ కళ్యాణి మోహన్‌మీద ప్రేమకన్నా అతని డబ్బుమీదా, అతను చేయించే వస్తువులమీద వ్యామోహం ఎక్కువ చూపుతుంటుంది. తన పరిస్థితిని ఎలాగైనా ఆమెకు చెప్పాలని నిశ్చయించుకుంటాడు మోహన్. మోహన్ చెప్పిన మాటలు విని తెల్లబోయి, అతనితో తెగతెంపులు చేసుకొని, బాగా డబ్బున్న శేషగిరితో తిరుగుతుంటుంది కళ్యాణి. తన బావ తనకు దక్కేలా చేయమని అర్థించిన రాధకు, అలాగే చేస్తానని అభయం ఇస్తుంది స్వాతి.

"రవీ! మీరు రాధని పెళ్లి చేసుకోవాలి."

"స్వాతీ! ఇటువంటి తలతిక్క మాటలు మాట్లాడితేనే కోపం వస్తుంది" అన్నాడు.

"కాదు రవీ! మీకు నామీద ఏమైనా ప్రేమ వుంటే నేను చెప్పింది చెయ్యండి!" అంది.

"ముందు అసలు విషయం చెప్పు?"

స్వాతి రవి కాలిమీద తల వాల్చి రాధ వచ్చిన విషయం, తను రాధకు మాట ఇచ్చిన విషయం చెప్పింది.

రవి చటుక్కున లేచాడు.

"స్వాతీ! ఎందుకలా అన్నావ్?"

"ఏమో! ఆ క్షణంలో అలా అన్పించింది."

"స్వాతీ! నా కిటువంటి పనికిమాలిన త్యాగాలంటే పరమ అసహ్యం. త్యాగం పిరికితనానికి సూచన. కోరింది సాధించడమే మన పద్ధతి! నిన్ను వదిలి వేరెవర్నీ చేసుకోలేను! చేసుకోను!"

"రేపు నా కంటే అధికురాలైన అమ్మాయి కనబడితే ఆ పిల్లతోనూ ఇలాగే చెప్తారా?"

ఆ మాటతో రవి ముఖం నల్లబడింది. క్షణం ఆగి బాధగా అన్నాడు –

"స్వాతీ! ఇంతేనా నువ్వు నన్ను అర్థం చేసుకుంది! నిన్ను చూశాక, నీ ప్రేమని పొందాక, మరో ఆడపిల్ల వేపు కన్నెత్తి అయినా చూడాలనిపిస్తుందా? నన్నింత చపలుడి కింద జమ కట్టావన్నమాట!"

స్వాతి తడబడిపోయింది.

"అదికాదు రవీ! పరిస్థితులు అలా వచ్చాయి."

రవి కళ్లు కోపంతో ఎర్రబడ్డాయి.

"అటువంటి మాటలంటేనే నాకు కోపం. మనం ధైర్యంగా నిలబడితే పరిస్థితులు ఏం చేస్తాయి?"

స్వాతికి ఇంకేం చెప్పాలో తోచలేదు.

"రవీ! చివరి మాటగా చెప్తున్నాను. రాధ అలా దుఃఖపడుతూంటే నేను మిమ్మల్ని చేసుకోలేను. మనని గూర్చి మరో ఆడపిల్ల వుసూరు మనకూడదు."

రవి కుర్చీలోంచి లేచాడు.

"స్వాతీ! ఇన్ని మాటలెందుకు? అసలు నీ మనసులో వున్నది చెప్పరా? నీకు నామీద ప్రేమలేదు! మీ నాన్నగారు ఏదో మంచి సంబంధం చూశారు! అది చేసుకోవాలని వుంది! రాధ వంక చెప్తున్నావ్? స్వాతీ! నాకు అబద్ధం చెప్పేవాళ్లన్నా, మోసం చేసే వాళ్లన్నా అసహ్యం." అంటూ కోపంగా అక్కడి నుంచి వెళ్లబోయాడు.

స్వాతి చటుక్కున అతని చేయి పుచ్చుకుంది.

"రవీ! ఇందాక నన్ను అన్నారు, మరి నన్ను మీరు అర్థం చేసుకుంది ఇదేనా! నేనెంత బాధపడుతున్నానో, నా గుండెలెంత బ్రద్దలయి పోతున్నాయో మీకు తెలీదు!"

రవి చప్పున తగ్గిపోయాడు.

"స్వాతీ! అలా బాధపడవద్దనే చెప్తున్నాను. మనం పెళ్లి చేసుకుని హాయిగా వుందాం. పోనీ ఇద్దర్నీ చేసుకోనా?" అన్నాడు ఎగతాళిగా.

"ఇద్దరినేం ఖర్మ! ఇంకో నలుగుర్ని కట్టుకోండి!"

"అమ్మో! నా కంత ఓపికలేదు."

''పరిహాసం చాలించి నేను చెప్పినట్లు చెయ్యండి.''

''ఓ యెస్! వచ్చేనెలలో పెళ్లి కావాలి. అంతేనా! రేపే రిజిష్ట్రరాఫీసుకెళ్లి అప్లికేషన్ పడేస్తాను. వచ్చేనెలలో మన పెళ్లి తప్పకుండా జరుగుతుంది, వస్తాను'' అని చరచరా వెళ్లి పోయాడు.

స్వాతి హతాశురాలయింది.

రవికెలా చెప్పాలి ?

ఇంకేం చెప్పినా వినిపించుకునే స్థితిలోలేడు !

రాధని కాదని తను రవిని చేసుకోలేదు !

రవీ, రాధా పెళ్లి చేసుకోవాలంటే తను వేరే పెళ్లి చేసుకోవాలి !

రవి, రాధల కోసమైనా తను జీవితంతో రాజీపడక తప్పదు.

అన్నయ్య త్వరగా వస్తే బాగుణ్ను! కొంత ఈ సమస్య పరిష్కారం అవుతుంది !

ఆలోచిస్తూ కూర్చుంది స్వాతి.

*　　*　　*

''కళ్యాణీ! నిన్న శెలవు పెట్టావెందుకు ?'' అనడిగింది స్వాతి.

''డాక్టరు దగ్గిరికెళ్లాను.''

''ఎందుకూ !?''

''పెద్ద విశేషం లేదు, అందరికీ వచ్చే జబ్బే వచ్చింది'' అంది మెల్లగా కళ్యాణి.

స్వాతి తెల్లబోతూ – ''అంటే'' అంది

''నా కిప్పుడు రెండో నెలనుకుంటాను.'' కళ్యాణి ఎంతో మామూలుగా చెప్పింది స్వాతి బిత్తరపోయింది.

''కళ్యాణీ !''

''అవును, ఇందులో ఆశ్చర్యపడాల్సిందేముంది?''

''మరి . మరి . . అతనితో చెప్పావా ?''

''ఎవరితో! శేషగిరితోనా! చెప్పాను పాపం! నా మీద ఎంతో జాలిపడుతూ అయిదొందలిచ్చాడు.''

''ఎందుకూ ?''

''ఎబార్షన్‌కి.''

''కళ్యాణీ'' స్వాతి భయంగా చూసింది.

ఇంతటి సమస్య ముంచుకొచ్చినా కళ్యాణి అలా ప్రశాంతంగా ఎలా వుండగలుగుతోందో అర్థం కాలేదు స్వాతికి.

''కానీ స్వాతీ! నేను ఎబార్షన్ చేయించుకోవడంలేదు. బాబుని కని, ఇడిగో నీ వారసుడు అని శేషగిరికి చూపాలని వుంది.''

స్వాతికి నోటిమాట రాలేదు. కళ్యాణి తనకెప్పుడూ అర్థం కాలేదు! కాదు కూడా! దానిదో విచిత్రమైన స్వభావం! కళ్యాణిలాటి వాళ్లు జీవితాన్ని చాలా తేలిగ్గా తీసుకుంటారు ఏదైనా సమస్యలొచ్చినా తనలా బుర్ర బద్దలుకొట్టుకోరు. అసలటువంటి వాళ్లే జీవితంలో ఎక్కువ సుఖపడతారేమో !

''స్వాతీ! అంత ఆలోచనా నా గురించేనా! నా గురించి నేనే బాధపడటల్లేదు! నీ కెందుకంత బాధ? ఆలోచనలెక్కువైతే సుఖం తక్కువై పోతుందే! హాయిగా తిని, తిరుగు. సమస్యల్ని తేలిగ్గా తీసుకో! లోకాన్ని గూర్చి పట్టించుకోకు! నీ మనస్సుకు వచ్చిన విధంగా నడుచుకో! ఇదే జీవిత సత్యం!'' – జీవితపు పాఠాన్ని ఎంతో తేలిగ్గా చెప్తోంది.

''ఇవ్వాల్టికి ఈ పాఠం చాలు! నా కిప్పుడు క్లాసు వుంది! కొద్దిగా ప్రిపేరు కావాలి!'' అంటూ పుస్తకం చేతిలోకి తీసుకుంది కళ్యాణి.

స్వాతి ఎవరో కొత్త వ్యక్తిని చూస్తున్నట్లు కళ్యాణివేపు చూడసాగింది.

*　　*　　*

నాలుగు రోజులు గడిచాయి. ఈ మధ్య కాలంలో రవి ఓ నాడు వచ్చి –

''స్వాతీ! రిజిష్ట్రరాఫీసులో అప్లికేషన్ పడేశాను! నిన్ను పెళ్లి చేసుకునేది ఖాయం! నువ్వు రాకపోతే నిన్ను ఎత్తుకెళ్లైనా చేసుకుంటాను'' అన్నాడు.

స్వాతి ఏం మాట్లాడలేదు.

ఆ రోజే అన్నయ్య దగ్గర్నించి ఉత్తరం వచ్చింది. పెళ్లికొడుకుతో సహా ఎల్లుండి ట్రెయిన్‌లో వస్తానని వ్రాశాడు.



స్వాతి ఆ వుత్తరం చదివి ప్రక్కన పడేసింది! బరువుగా నిట్టూర్చింది.

ఏం జీవితాలు? కోరుకున్నదెన్నడూ లభించదు! కోరుకోనిది లభిస్తుంది! జీవితాంతం బాధ పెడ్తుంది! తనకింత ప్రేమ నెందుకు చవిచూపించాలి? చివరకు అగాధంలోకి ఎందుకు తోయాలి?

దుఃఖం ఉప్పెనలా వస్తోంది. అలాగే మంచం మీద వాలిపోయింది స్వాతి.

మళ్లీ తెల్లారి తండ్రి నిద్ర లేపుతుండగా మెలకువ వచ్చింది.

"స్వాతీ! అన్నయ్యొచ్చాడమ్మా!"

స్వాతి దిగ్గున లేచి కూర్చుంది "అప్పుడే వచ్చాడా?"

"అప్పుడే ఏమిటమ్మా! ట్రెయిన్ ఏడింటికి వస్తుంది. ఇప్పుడు ఏడున్నర దాటింది! ఆ అబ్బాయి కూడా వచ్చాడు. త్వరగా లేచి తయారవు తల్లీ!" అన్నాడు.

స్వాతి పావుగంటలో తయారయింది. టిఫిను ప్లేట్లు పుచ్చుకుని ముందు గదిలోకి వచ్చింది.

"రా స్వాతీ! ఈమె నా చెల్లెలు స్వాతి"

స్వాతి ట్రే టేబిల్‌మీద పెట్టింది

"ఇతడు మోహన్ అని మా కంపెనీలో క్రొత్తగా చేరాడమ్మా!"

స్వాతి తలెత్తి అతనివేపు చూసి వులిక్కిపడింది. అతడిని ఎక్కడో చూసింది.

"ఇతడు మోహన్ అని నా బెస్ట్ ఫ్రెండ్ స్వాతీ!"

కళ్యాణి మాటకు అభ్యంతరం చెప్తూ — 'ఒట్టి ఫ్రెండ్‌నే కాదండోయ్! కాబోయే మొగుణ్ణి కూడా" అన్నాడు నవ్వుతూ

స్వాతి మోహన్ వేపు చూసింది. ఆనాటి సంతోషం కానీ, వుత్సాహం కానీ అతనిలో మచ్చుకైనా కన్పించడంలేదు సర్వం కోల్పోయిన వాడిలా వున్నాడు. స్వాతి వేపు చూసి నవ్వాడు. కానీ ఆ నవ్వులో ఆనాటి అందం లేదు.

"కూర్చో స్వాతీ!" అని, "తీసుకోవోయ్, మోహన్!" అంటూ ప్లేటు ఇచ్చాడు అన్నయ్య.

"మా స్వాతి ఇక్కడ కాలేజీలో వర్క్ చేస్తోంది! మంచి లెక్చరర్‌గా పేరు వుంది."

"అలాగా!"

"స్వాతీ! మోహన్ చాలా నెమ్మది ఎక్కువ మాట్లాడడు! చాలా ముభావంగా వుంటాడు."

స్వాతికి ఆ మాటలు నవ్వు తెప్పించాయి.

"స్వాతీ! మోహన్ ఒట్టి వాగుడుకాయ! మాట్లాడ్డం మొదలుపెట్టాడంటే ఫుల్‌స్టాప్, కామా వుండదు!" మోహన్ని గూర్చి కళ్యాణి చేసిన కామెంట్ అది.

అన్నయ్య టిఫిను, కాఫీ పూర్తిచేసి "మోహన్! నేను స్నానం చేసి వస్తాను మీరిద్దరూ మాట్లాడుతూ వుండండి!" అంటూ లేచివెళ్లాడు

స్వాతి మోహన్ని గూర్చే ఆలోచిస్తోంది మోహన్ ఎందుకలా వున్నాడు? కళ్యాణి ఈమధ్య మోహన్ని గూర్చి చెప్పడంలేదు! ఎందుకనో?

"మీకిక్కడనుంచి ట్రాన్స్‌ఫరయిందా?"

మోహన్ తలెత్తి స్వాతివేపు చూశాడు

"లేదండీ! నేనే కావాలని చేయించుకున్నాను" అన్నాడు మోహన్.

"ఎందుకని?" ప్రశ్నించింది స్వాతి.

"అసలు విషయం చెప్పమంటారా!"

"చెప్పండి."

"కళ్యాణికీ, నాకూ వున్న పరిచయం మీకు తెలుసు! కళ్యాణిని నేను ప్రాణాధికంగా ప్రేమించాను. కాని కళ్యాణి నేను చాలా డబ్బున్నవాడినని నన్ను ప్రేమించినట్లు నటించింది నా అసలు జీవితం తెలీగానే నన్ను మర్చిపోయింది కాని నేను కళ్యాణిని మర్చిపోలేకపోయాను. కళ్యాణిని కలిసి ఆమెతో నా ప్రేమను చెప్పడనికి ఎంతో ప్రయత్నించాను. కానీ ఆ తర్వాత కళ్యాణి నావేపు కన్నెత్తి కూడా చూడలేదు. నేను కన్పిస్తేనే అసహ్యంగా ముఖం తిప్పుకునేది ఈ బాధని భరిస్తూ ఇక్కడ వుండలేక ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నానండీ!"

ఇది వారో "ప్రేమకథ" అన్నమాట!

"మీరు కళ్యాణిని ఇప్పటికీ ప్రేమిస్తున్నారా?"

"ఇప్పటికే కాదు, ఎప్పటికీ ప్రేమిస్తాను ప్రేమంటే ఒకరోజు వుండి మరునాడు పోయేది కాదండీ!" అన్నాడు కొద్దిగా బాధగా.

తనూ అటువంటి స్థితిలోనే వుంది కాబట్టి అతడిని ఎక్కువ ప్రశ్నించలేదు స్వాతి.

"మరి పెళ్లి చూపులకెందుకు వచ్చారు?"

"పెళ్లిచూపులకు రాలేదు! మీ అన్నయ్యగారు మీ పేరు స్వాతి అని చెప్పగానే కళ్యాణి జ్ఞాపకం వచ్చింది కళ్యాణి మీ స్నేహితురాలని తెలుసు. అసలు విషయం మీకు చెప్పి ఒక్కసారి కళ్యాణిని చూసిపోదామని వచ్చాను స్వాతిగారూ! మీరు కళ్యాణిని ఇక్కడకు తీసుకురావాలి. ప్లీజ్ నా కోసం! దూరంనుంచైనా ఒక్కసారి చూసి సంతోషిస్తాను."

కళ్యాణిమీద అతనికి గల ప్రేమకు చలించి పోయింది స్వాతి.

"మోహన్‌గారూ! కళ్యాణి చాలా మంచి పిల్లండీ! కానీ కళ్యాణి కుటుంబ పరిస్థితి దాన్ని అలా తయారుచేసింది దానికి ఎన్నో కోరికలున్నాయండీ అవి తీరాలంటే డబ్బున్న వ్యక్తి భర్తగా రావాలి అందుకే అటువంటి వ్యక్తి కోసం అన్వేషిస్తోంది మీకు డబ్బులేదని తెలీగానే మీకు దూరమైంది. అది దాని తప్పు కాదండీ! దాని పరిస్థితులటువంటివి మీలాటి వాళ్లు సానుభూతితో అర్థం చేసుకోవాలి" అంది స్వాతి.

ఆ మాటలకు నొచ్చుకుంటూ — "నాకు కళ్యాణిమీద కోపం లేదండీ! నా దురదృష్టం మీద నాకే కోపం!" అన్నాడు మోహన్.

"కళ్యాణికి తన అన్వేషణలో మీలాటి మంచి వాళ్లేకాక కొంతమంది చెడ్డవాళ్లూ తారసపడవచ్చు. వాళ్లవలన మోసం కూడా సంభవించవచ్చు. కళ్యాణి ఇప్పడలాగే మోసపోయిందండీ."

స్వాతి మాటల్లోని భావం మోహన్‌కి అర్థమైంది

"చూడండి మోహన్‌గారూ! ఇప్పుడు కనుక కళ్యాణి మిమ్మల్ని చేసుకోమని అడిగితే మీరు చేసుకోగలరా?" స్వాతి సూటిగా ప్రశ్నించింది.

మోహన్ ముఖంలో ఆనందం తొంగిచూసింది.

అది చూసి స్వాతి—"కానీ, మోహన్‌గారూ .." అంటూ ఏదో చెప్పబోయింది.

"మీరింకేం చెప్పకండి. నా కర్థమైంది. కానీ నేను ప్రేమించింది కళ్యాణిని. నాకు కావల్సిందీ కళ్యాణే! ఆమె తప్పొప్పులతో నాకు పనిలేదు. ఆమె ఎటువంటిదైనా నేను మనస్ఫూర్తిగా ప్రేమిస్తాను" దృఢంగా అన్నాడు.

ఆ మాటల్లో కపటం గానీ, అబద్ధం కానీ కన్పడలేదు స్వాతికి. అతని ప్రేమకు ఆనందం కూడా కలిగింది.


'కళ్యాణీ! నువ్వు చాలా అదృష్టవంతురాలివి' అనుకుంది మనసులో.

"మోహన్‌గారూ! కళ్యాణికీ, మీకూ పెళ్లి జరిగేట్టు చూసే బాధ్యత నాది!"

ఆ మాటతో మోహన్ చప్పున ముందుకు వంగి స్వాతి చేతుల్ని పట్టుకుని కళ్లకద్దుకున్నాడు.

స్వాతికి రాధ జ్ఞాపకం వచ్చింది.

"స్వాతీ! మీరు ... మీరు .. చాలా గొప్పవారండీ!" అన్నాడు మోహన్.



# ప్రశ్నావళి

**-కె. రామలక్ష్మి**

డి. పి — భిలాయి

మీకు జ్యోతిషం మీద నమ్మకం వుందా ?

★ ఏ పూట కాపూట మన రాత తెలిసిపోతూ వుంటే — యింకా జ్యోతిష్యం ఎందుకండీ బాబూ !

వాసు, ప్రసాద్ — అడలూరు.

చాలామంది రచయితలు, నటీనటులు పొగడ్తలకి పొంగిపోమని తెగడ్తలకి కృంగిపోమని చెప్తూ వుంటారు. మీరూ అంతేనా ?

★ అంతే ! అంతేకాదు, నల్గురిమధ్య పనిచేసే వాళ్ళమీద ఎప్పుడూ రాళ్ళూ, పువ్వులూ పడుతూనే వుంటాయి. ఎవరో ఏదో అన్నారని రాయడం మానేయడం ఎంత అవివేకమో, ఎవరో ఓహో ! ఆహా ! అన్నారని నిజం అనుకోడమూ — అంతే అవివేకం అని నా అభిప్రాయం.

యు. యు.— ఉరుంకుదు.

ఎంత సంపాదించినా యింకా సంపాదించాలనే తపనా, ఆరాటం ఎందుకు ? అతని కుదులో తృప్తి మిగులుతుందంటారా ?

★ తన తృప్తి కోసం కాదతగాడు పడే — ఆరాటం. ముందు తరాల వారికి యింకా యింకా చేర్చి పెట్టాలన్న తపన అది. వంట చేసిన వాళ్ళకి తిండి తినాలనిపించదు. సంపాదించే కొద్దీ వాళ్ళకీ అంతే. సంపాదించడమే — ఛాలెంజి. థ్రిల్.

జి. జె. ఆర్. — వైజాగ్

అక్కయ్యా ! మీకో జబ్బు వుంది. అదే సూటిగా సూది గుచ్చినట్టు మాట్లాడడం. అది మానుకుని అమృతాన్ని చిలికించినట్లు మాట్లాడ్డానికి ప్రయత్నించగోరుతాను ?

★ నైస నైసుగా మాట్లాడి వున్నది చెప్పక పోవడం నాకు చేతకాదు; చచ్చుగా మాట్లాడితే చచ్చుగా మాట్లాడుతున్నారని; గంగలో దిగుతూంటే గంగలో దిగబడుతున్నారని చెప్పక — యింటల్లుడిలాగ ఇచ్చకాలు చెప్పి పబ్బం గడుపుకోవడం నాకు చేతకాదు; తడిగుడ్డతో గొంతు కోయడం కంటే — వెట్టుకత్తితో ఒక్కవేటు వేయడం — ఆ జీవికి సుఖం అని నేను భావిస్తాను. ఎవరేనా నేను పొరపాటు చేశానని చెప్పడానికి ఒకటే — శాఖా చంక్రమణం చేస్తూవుంటే — ఎందుకొచ్చిన డొంక తిరుగుడు. నేనేం చేశాను! అని అడిగేస్తాను. అనుమానం నివృత్తి చేసుకుంటాను. మంచి స్నేహితులు మిగలాలంటే — సూటిగా వుండడం ఒక్కటే దారి అని నా భావన.

ఎ. ఎమ్. — నల్లమాడు.

కట్నం తీసుకోకూడదని ఆదర్శప్రాయంగా వుండాలని చాలామంది లెక్చర్లు గుంచుతారేగాని కనీసం నూటికి ఒక్కరైనా ఆచరణలో పెడుతున్నారా ?

★ ఎందుకు పెట్టడంలేదు ? చాలామందే — ఆచరణలో తమ ఆదర్శాలని పెట్టుతున్నారు. ఎటొచ్చీ — పెట్టనివాళ్ళ కొచ్చినంత పేరు — ఆచరణలో పెట్టేవారికి రాదు. ఎందుకంటే — వీరు తమ ఆదర్శాలని కప్పెక్కి అరవరు.

ఎం. బి. ఆర్ — బైపల్లి.

రామలక్ష్మిగారూ ! మీ క్వాలిఫికేషన్ ఏమిటో మాకు తెలియదండి ?

★ ఏమీ లేకపోవడమే — పెద్ద క్వాలిఫికేషన్. వరసగా అఆలు రావు. కాని రచనలు చేయకలను. ఉట్టికెగర లేకుండా వున్నాను, కాని స్వర్గం — నా టార్గెట్ !

ఆర్. ఎమ్. కె. ఆర్. — కూనవరం.

ప్రేమించి పెళ్ళాడిన ప్రియునిపై ఎక్కువ విధేయత కల్గివుంటుందా ? పెళ్ళాడి ప్రేమించిన వానిపై ఎక్కువ విధేయత కల్గివుంటుందా ?

★ ఏ రాయి అయితేనేం ? పళ్ళూడ గొట్టుకుందుకు ! అనుకుంటుందీ నాడు స్త్రీ ! కాని ఒక్కటి మాత్రం చెప్పగలను — తిండీ, బట్టా ఇచ్చి దెప్పేవాడిని కాదు స్త్రీ గౌరవించేది — తిండీ, బట్టా యిచ్చీ — స్త్రీగా గౌరవించే వాడిని — ఆరాధిస్తుంది !

బి. ఏ; బి. బి. — ఆదోని.

మీ జవాబులు చదువుతూవుంటే మీకు ఎంత పురుష ద్వేషమో అర్థం అవుతుంది ?

★ మీరు నన్ను చాలా పొరపాటుగా అర్థం చేసుకుంటున్నారు పురుషులపై నా కెందుకు ద్వేషం ? నేను గౌరవించేది ఎందరో పురుషులే! ఎటొచ్చీ వారు స్త్రీపై స్త్రీగా కాక వ్యక్తిగా గౌరవం కలవారు. నన్ను ఆడదానిగా కాదు—సాటి మనిషిగా గౌరవింప కలవారు వారు. ఆడది ఆడదానిగానే వుండాలను కోవడం పురుష అహంకారానికి చిహ్నం అని నా భావన. ఆడతనం ఒక లక్షణం అని ఎందుకనుకోరు మీరు ?

బి. ఎస్. ఎమ్. బి. — మచిలీపట్నం.

ఏమిటి సమాధానాలు యిష్టమొచ్చినట్టు రాస్తున్నారు? అసలు మీరెలాంటి త్యాగమూర్తులు?

★ చెప్పాలనేవుంది — కాని చేసిన త్యాగాలు చెప్పడం నాగరికతకాదని వూరుకుంటున్నానయ్యా ! అయినా ఒకటి — నీ పూర్తి లేఖకు సమాధానం ఇవ్వకుండా వుండడం కూడా నా త్యాగశీలతను చాటి చెప్తోందని గ్రహిస్తే అదే పదివేలు !! ★

---

స్వాతికి తన పరిస్థితి జ్ఞాపకం వచ్చి కళ్ళల్లో నీళ్ళు తిరిగయి !

పేలవంగా నవ్వుకుంటూ — "మోహన్‌గారూ! గొప్పదాన్ని కాదండీ ! మీకు తెలీదు, నేను చాలా దురదృష్టవంతురాల్ని" అని అనుకుంది మనసులో.

* * *

సాయంత్రం అరయింది. మోహన్, అన్నయ్య షికారు వెళ్ళారు. స్వాతి వరండాలో కుర్చీ వేసుకుని కూర్చుంది. పడమటి కొండమీద ఎవరో శవాన్ని కాలుస్తున్నంత ఎర్రగా వుంది. ఆ ఎర్రని మంటల్లో పడి తన ప్రేమ, కోరికలు, ఆశలు అన్నీ కాలిపోతున్నట్లనిపించింది. ఈ ఆరునెలల్లోనే ఎన్నో అనుభవించింది.

ప్రేమించింది !

విరహ పడింది !

అసూయ, ద్వేషం !

ఆ తర్వాత — త్యాగం ! అన్నీ అనుభవానికి వచ్చాయి.

మనుషుల్ని దగ్గిరికి చేర్చి, వారి మధ్య అనుబంధాల్ని ఏర్పరచి, తిరిగి వారిని విడదీయడం భగవంతుని కిష్టమేమో ! రవి పరిచయంతో తన అన్వేషణ ముగిసిందని సంతోషపడింది. తన జీవితానికి సరైనతోడు లభించిందని పొంగిపోయింది! కాని చివరికి ఏమయింది ! రవిని వదులుకోవాల్సి వచ్చింది.

పోనీ వివాహం చేసుకుని జీవితంతో రాజీ పడదామనుకుంటే, అదీ సాధ్యపడలేదు! ఒక్కొక్కళ్ళ జీవితాలింతే !

'రవి ఈ పాటికి ఏం చేస్తుంటాడో ?'

వెంటనే తనని తాను నిందించుకుంది స్వాతి.

ఛ ! ఏమిటిది ? ఇక రవిని తలుచుకో కూడదు ! ఈ జ్ఞాపకాల్ని, ఈ మనుషుల్ని ఈ వాతావరణాన్ని — మర్చిపోవాలి ! పూర్తిగా మర్చిపోవాలి !

కాని, ఇక్కడ వుంటే మాత్రం అది సాధ్యం కాదు ! ఇక్కడినుంచి వెళ్ళిపోవాలి ! కాని, ఎక్కడికి వెళ్ళాలి ?

స్వాతికి హఠాత్తుగా గుర్తుకు వచ్చింది, మధ్యాహ్నం ప్రిన్సిపాల్ పిలిచి చెప్పిన విషయం —

"స్వాతీ ! గల్ఫ్ కంట్రీస్‌లో ట్రెయిన్డ్ టీచర్స్ కావాలిట ! ఎడ్వర్టయిజు చేశారు ! నాకు తెల్సినొకాయన 'మీ కాలేజీనుండి ఎవర్నైనా పంపించండి' అనడిగితే నాకు నువ్వు జ్ఞాపకం వచ్చావు. స్వాతీ ! నువ్వు వెడతావా ? అక్కడ మూడేళ్ళు వుండాల్సి వుంటుంది. మూడేళ్ళు అయ్యాక నువ్వు కావాలంటే అక్కడ వుండొచ్చు. లేకపోతే తిరిగి వచ్చేయచ్చు. ఒంటరిగానా అనే భయం అక్కర్లేదు. నీతోపాటు ఇంకా అమ్మాయిలు వుంటారు. అక్కడ నీకే విధమైన కష్టమూ రాదు. ఆ హామీ నేనిస్తాను. ఆలోచించి నాకు ఏ సంగతి రెండ్రోజుల్లో చెప్పాలి ! మంచి అవకాశం. నువ్వు ఉపయోగించుకుంటే బాగుంటుందని నా వుద్దేశం. నీ కిష్టం లేకపోతే ఇంకెవరి పేరైనా సజెస్ట్ చేస్తాను ! ఆలోచించు !"

ఆలోచిస్తోంది !

ఇంకా ఆలోచిస్తోంది !

ప్రస్తుతం వున్న పరిస్థితుల్లో తనకు మార్పు అవసరం !

తను కనుమరుగయితే రవీ, రాధా దగ్గర కావచ్చు !

ఇదీ ఒకందుకు తన మంచికే వచ్చింది !

నాన్నగారిని ఒప్పించి వెళ్ళాలి !

నాన్నగారు తన మాట కాదనరు !

కొన్నాళ్ళపాటు ఈ వాతావరణానికి దూరంగా వెళ్ళాలి !

అవును ! వెడతాను !

స్వాతి మనస్సు తేలికయింది.

*(అయిపోయింది)*